
# ఎవరిదీ అడవి?

## అడవిలో ఆదివాసుల భూమి హక్కు



మానవహక్కుల వేదిక (HRF) ప్రచురణ

# ఎవరిదీ అడవి?

అడవిలో ఆదివాసుల భూమి హక్కు

ఆదివాసుల హక్కులకోసం
నిరంతరం శ్రమించిన
డా. బి. జనార్ధనరావు
స్మృతిలో

# ఎవరిది అడవి?

అడవిలో ఆదివాసుల భూమి హక్కు

మానవహక్కుల వేదిక ప్రచురణ
Human Rights Forum Publication

● ప్రచురణ సంఖ్య: 9
● ప్రచురణ కాలం : ఫిబ్రవరి 2003
● కాపీలు: 2000 ● వెల: 5 రూపాయలు
● కవర్ : మోహన్
● ముద్రణ: నవ్యప్రింటర్స్

ప్రతులకు :
ఎస్. జీవన్ కుమార్
3-12-117/ఎ-2/1, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13. ఫోన్: 27039519

ప్రజాశక్తి, ప్రగతి, నవోదయ, దిశ బుక్‌హౌస్‌లు

కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ 2002 మే నెల 3వ తేదీన జారీ చేసిన సర్క్యులర్ పైన నాలుగు నెలలు ఆలస్యంగా చెలరేగిన దుమారం అకస్మాత్తుగా చల్లబడినట్టు అనిపిస్తున్నది. ఆ తాఖీదును అమలుచేసే ఉద్దేశ్యం తమకు లేదని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు - మన రాష్ట్ర ప్రభుత్వంతో సహా - ఆదివాసీ సంస్థలకు హామీ ఇవ్వడం దానికి కారణం కావచ్చు.

అదే నిజమయితే చాలా దురదృష్టకరమని చెప్పక తప్పదు.

ఎందుకంటే ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతున్న సామాజిక ఆర్థిక నీతి ఒకటి రెండు హామీలతో మారేదికాదు. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సర్క్యులర్ వెనక తక్షణ కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ, దానికి నిజమైన బలం ఈ నీతి నుండి వచ్చిందనడంలో సందేహం లేదు.

అందువల్ల ఆదివాసుల మనుగడపైన దాడి అయిపోలేదు. అది ఇప్పుడే మొదలయింది. వెనువెంటనే వారందరినీ అడవుల నుంచి తరిమేసి అడవులు ఖాళీ చేయించేయక పోవచ్చు. అయితే అడవులలో ఆదివాసుల జీవనానికి భద్రత కల్పించే క్రమబద్ధీకరణ మాత్రం ఇంక కష్టం.

ఈ విషయాన్నీ దానికి ఉండగల పర్యవసానాలనూ అర్థం చేసుకోవాలంటే చాలా విషయాలు అర్థం చేసుకోవాలి.

భారతదేశ జనాభాలో 8 శాతం ఆదివాసులు. వారంతా అడవులలో లేరు. అడవులలో ఉన్నవారంతా రిజర్వ్ ఫారెస్టు నరికి వ్యవసాయం చేయడం లేదు. రిజర్వ్ ఫారెస్టులో ఇళ్లు వేసుకొని బతకడం లేదు. దేశ జనాభా 100 కోట్లయితే, అందులో 75 లక్షల నుండి ఒక కోటి మంది (15 లక్షల కుటుంబాలు) రిజర్వ్ ఫారెస్టులోని భూమిని నివాసం కోసమో, వ్యవసాయం కోసమో ఆక్రమించుకున్న ఆదివాసులయి ఉంటారని అంచనా.

ఈ కోటి మంది అడవులలోకి కొత్తగా వచ్చి చొరబడిన వారు కారు. వారిని 'చొరబాటుదార్లు'గా ప్రకటించడానికొక చట్టమంటూ లేని కాలం నుంచి వారి పూర్వీకులు అడవులలో నివసిస్తున్నారు. వెనక వచ్చిన చట్టం ముందు నుంచి ఉన్న ఆదివాసులను చొరబాటుదార్లు లేక కబ్జాదారులు అనింది. ఎవరయినా ఎవరికయినా ఏ పేరయినా పెట్టుకోవచ్చునుగానీ తన అభిప్రాయాన్ని బలప్రయోగంతో అమలుచేసే అధికారం చట్టానికి ఉంది కాబట్టి, అప్పటి నుంచి అడవులలో ఆదివాసుల తలమీద ఒక ప్రశ్నార్థకం వచ్చి నిలబడింది.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఆదివాసులు తమ నివాస స్థలాలలో అనాదిగా నివసిస్తున్నారనీ 'నాగరికత' వ్యాప్తి వారి మనుగడ మీద దాడిగా మారే ప్రమాదం ఉందనీ గుర్తించిన చట్టాలు కూడ ఉన్నాయి. రాజ్యాంగంలోని అయిదు, ఆరవ షెడ్యూలులే ఆ విషయాన్ని గుర్తించాయి. 1996లో పార్లమెంటు షెడ్యూలు ప్రాంతాలలో స్వయంపాలన కల్పించే లక్ష్యంతో సమగ్రమైన చట్టం చేసింది. ఈ చట్టాల వల్ల ఆదివాసులకు జరిగిన మేలు లేకపోలేదు గానీ, అవన్నీ కలిసి చేసిన మేలుకంటె ఒక్క అటవీ సంరక్షణ చట్టం చేసిన నష్టం ఎక్కువ అంటే అతిశయోక్తి కాదు.

1977కు పూర్వం ప్రతీ రాష్ట్రానికీ ప్రత్యేకమైన అటవీ చట్టాలు ఉండేవి. అప్పటిదాకా 'అడవులు' అనేవి రాష్ట్రాల అధికారాల జాబితాలో ఉండేవి. అంటే అడవుల గురించి చట్టాలు చేసే అధికారం, విధాన రచన చేసే అధికారం రాష్ట్రాలకు మాత్రమే ఉండేది. ఎమర్జెన్సీ కాలంలో అధికార కేంద్రీకరణకు దోహదం చేసే అనేక మార్పులు తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ, 'అడవుల'ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో చేర్చింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉనికిలోకి వచ్చిన అనేక మార్పులను తిరగదోడి తొలినాటి పరిస్థితిని పునరుద్ధరించే 44వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చింది. అయితే 44వ రాజ్యాంగ సవరణ చేయని సవరణలలో ఒకటి, 'అడవులను' తిరిగి రాష్ట్రాల జాబితాలో వేయడం.

అడవుల రక్షణపైన కేంద్రానికి అజమాయిషీ లేకపోవడం వల్ల ఒక జాతీయ అటవీ విధానం లేకుండా పోయిందనీ, అటవీ సంరక్షణ సమర్థంగా చేయాలంటే 'అడవుల' గురించి చట్టాలు చేసే అధికారం కేంద్రానికి ఉండాలనీ ఇందిరా గాంధీ ప్రభుత్వం భావించినట్టే జనతా పార్టీ ప్రభుత్వమూ భావించింది.

## అటవీ సంరక్షణ చట్టం (1980)

ఈ క్రమంలో 1980లో అటవీ సంరక్షణ చట్టం వచ్చింది. వేగంగా తరిగిపోతున్న అటవీ సంపదను కాపాడడం ఆ చట్టానికి గల ప్రధాన లక్ష్యం. ఆనాటి నుండీ ఈనాటిదాకా చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్న ఒక విషయమేమిటంటే పర్యావరణ సమతుల్యానికి

కావలసింది అడవులు కాదు, చెట్లు. అంటే అటవీ శాఖ యాజమాన్యంలోని భూమిని కబ్జాదార్ల నుంచి, పోడు వ్యవసాయం చేసే ఆదివాసుల నుంచి కాపాడి వనాలు పెంచడమే దానికి ఏకైక పరిష్కార మార్గం కాదు. రెవెన్యూ భూమిలో (అది పట్టాభూమి కావచ్చు, ప్రభుత్వ పోరంబోకులో బంజర్లో కావచ్చు) పంటచేల బదులు చెట్లు పెంచడాన్ని ప్రోత్సహించడమూ అదే ఫలితాన్ని ఇస్తుంది. ఉదాహరణకు, 10 వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్టు నుంచి 5 వేల ఆదివాసీ కుటుంబాలను తొలగించి, వారు వ్యవసాయం చేసుకుంటున్న సాగు భూములలో టేకు చెట్లో, మద్ది చెట్లో పెంచే బదులు వారిని అక్కడే వ్యవసాయం చేసుకోనిచ్చి, ఆ అడవి బయట 10 వేల ఎకరాల పట్టా భూములలో మామిడి తోట సీతాఫలం తోటలో పెంచడానికి కావలసిన ప్రోత్సాహాన్ని రైతులకు ఇయ్యవచ్చు. ప్రోత్సాహం చాలకపోతే రుణాల మంజూరీతో ముడిపెట్టి బలవంతమూ చేయవచ్చు. ఒక్కొక్కచోట దీని వల్ల రైతులు కొంత ఆదాయం కోల్పోవలసి రావచ్చు. కానీ పర్యావరణం కోసం ఆదివాసులు మాత్రమే ఎందుకు త్యాగాలు చేయాలి? మనమంతా ఎందుకు చేయకూడదు?

ఏమయితేనేం, 1980లో పార్లమెంటు అటవీ సంరక్షణ (ఫారెస్ట్ కన్జర్వేన్సీ) చట్టాన్ని చేసింది. ఇకమీదట రిజర్వ్ ఫారెస్టులో ఎవరికీ పట్టాలు ఇవ్వడానికి వీలులేదనీ, రిజర్వ్ ఫారెస్టు భూముల పైన ఎవరికీ హక్కులు కల్పించడానికి వీలులేదనీ ఆ చట్టం అంటుంది. రిజర్వ్ ఫారెస్ట్ అంటే ఏమిటంటే ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టంలోని సెక్షన్ 3 కింద ప్రభుత్వం దేనినయితే రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటిస్తుందో అది. దానికి వేరే నిర్వచనం లేదు. అంటే రాష్ట్ర అటవీ చట్టం కింద అటవీ శాఖ ఏ భూమినయినా రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించి, అక్కడ పట్టాలు లేకుండ వ్యవసాయం చేసుకుంటున్న వారందరినీ తొలగించి అడవులు పెంచుకోవచ్చునన్న మాట.

శతాబ్దాలుగా – ఒక అటవీ చట్టమంటూ లేని పూర్వకాలం నుంచి – ఆ అడవులలో నివసిస్తూ ఉండి, వ్యవసాయం నేర్చుకున్నాక అక్కడే వ్యవసాయం చేసుకుంటూ ఉండి, ప్రభుత్వం పట్టా ఇవ్వకపోవడం వల్ల పట్టాపొందని ఆదివాసులకు ఈ నిషేధం చాలా అన్యాయం చేస్తుందని వేరే చెప్పనవసరం లేదు. ప్రభుత్వానికి అర్జీ పెట్టుకొని తమ భూమికి పట్టా పొందాలన్న ఆలోచన కూడా ఆదివాసులలో చాలామందికి వచ్చి ఉండదు. భూమిలో వ్యవసాయం చేయడానికి పట్టా అక్కరలేదు కదా! సహకార బ్యాంకులో అప్పు తెచ్చుకోవలసి వస్తేనో, కమర్షియల్ బ్యాంకులో తనఖా పెట్టవలసి వస్తేనో అప్పుడు పట్టా కావాలి. ఆ అవసరం లేని వాళ్లు – వాన చినుకులు పడినప్పుడు తమకు అందుబాట్లో ఉన్న విత్తనం నాటి పంట తీసుకొని బతికే వాళ్లు – పట్టా పొందాలన్న ప్రయత్నమే చేసి ఉండరు. ఇప్పుడు అకస్మాత్తుగా ఢిల్లీలో కూర్చున్న పార్లమెంటు ఒక చట్టం చేసేసి, రిజర్వ్ ఫారెస్టులో పట్టా లేకుండ వ్యవసాయం చేస్తున్న వారంతా ఖాళీ చేసి వెళ్లిపోండి అనడం ఏం న్యాయం?

ఇది పల్లపు భూమిలో స్థిర వ్యవసాయం చేసేవారి విషయం. కొండ వాలులో పోడు

వ్యవసాయం చేసేవారయితే పట్టా ఇమ్మని అడిగే ప్రసక్తే లేదు. అడిగినా ఇచ్చే ప్రసక్తే లేదు. అయినప్పటికీ వారు ఏళ్ల తరబడి ఆ వాలు భూములలో పోడు వ్యవసాయం చేస్తూ ఉండవచ్చు. వాళ్లంతా ఇప్పుడు ఖాళీ చేసి అడవుల పెంపకానికి చోటు కల్పించాలని 1980లో వచ్చిన అటవీ సంరక్షణ చట్టం అనింది.

పోడు వ్యవసాయం చేసుకునే ఆదివాసులకు హక్కులు కల్పించే ఆలోచన ఆనాడూ ఈనాడూ లేదుగానీ, అడవులలో సమతలమైన భూములలో పట్టాలు లేకుండ స్థిర వ్యవసాయం చేసుకుంటున్న వారికి ఒక 'చివరి అవకాశం' ఇచ్చే ఆలోచన పది సంవత్సరాల తర్వాత ప్రభుత్వానికి వచ్చింది. అటవీ సంరక్షణ చట్టానికి అనుబంధంగా 1990లో జారీచేసిన ఒక ప్రభుత్వ మెమొరాండంలో దానిని పొందుపరచారు. రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించిన భూమిలో 1980 అక్టోబర్ 25 కంటె ముందు నుండి ఎవరైనా నివసిస్తూ, లేక సాగు చేసుకుంటూ ఉన్నట్టయితే, ఆ తారీఖుకన్నా ముందు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి అదవి భూములలో హక్కుల క్రమబద్ధీకరణ విధానం ఏదైనా ఉండి ఉంటే, ఆ రాష్ట్ర ప్రభుత్వం వారి హక్కును క్రమబద్ధీకరించవచ్చు (అంటే వారికి పట్టా ఇయ్యవచ్చు) అని దానిలో అన్నారు. ఈ మాత్రం దయకలగడానికి గల నేపథ్యాన్ని దిగువ చూద్దాం.

నిజానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ అటవీ భూముల క్రమబద్ధీకరణ విషయంలో ఒక ప్రకటిత విధానం ఉండి ఉండే అవకాశం లేదు. అంతటి పారదర్శకత మన పాలకుల లక్షణమే కాదు. ఒత్తిడి పెడితేనో పైరవీ చేసుకుంటేనో పట్టాలివ్వడమే తప్ప ఒక కచ్చితమైన విధానంగా ఇచ్చింది ఎప్పుడూ లేదు. కాబట్టి ఈ మినహాయింపు వల్ల పట్టాలు పొందే అవకాశం ఆదివాసులకు తక్కువే. ఇక్కడొకరూ అక్కడొకరూ ఆందోళన చేసో ఎంఎల్ఏ వెంట పడో 1990 తరువాత పట్టాలు పొందడం జరిగిందే తప్ప మిగిలిన వాళ్లంతా అంతకు ముందు లాగే పట్టాలు లేకుండ వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోయారు. అటవీశాఖ అధికారులు కేసులు పెట్టారు, కేసులు పెడతామన్న బెదిరింపుతో కోళ్లు, కల్లు సేవించిపోయారు, కొందరిని ఖాళీ చేయించి పంపించేసారు. మెజారిటీ మాత్రం ఎప్పుడేమవుతుందోనన్న భయంతో అడవులలో ఎప్పటిలాగే వ్యవసాయం చేసుకుంటూ కొనసాగారు.

మరొకవైపు, 1980 తరువాత కొత్తగా అటవీ భూములను ఆదివాసులు నరికి సాగు చేయడమూ జరిగింది. కొందరికి కుటుంబాలు పెరిగిన కారణంగా కొత్తగా భూమి అవసరం అయింది. కొందరు ఒక ప్రాంతంలో అడవి మీద ఒత్తిడి పెరిగి మరొక ప్రాంతానికి వలసపోయి అక్కడ అడవులు కొట్టుకున్నారు. కొందరు నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల గనుల వల్ల నిర్వాసితులయి కొత్త ప్రాంతాలకు వలసపోయారు. అటవీ సంరక్షణ చట్టంలోని నిషేధం కారణంగా వీరికి హక్కులు దక్కే అవకాశమే లేదు. మన రాష్ట్రంలో ఒరిస్సా నుంచి విశాఖపట్నం ఏజెన్సీకి వలస వచ్చిన కోదులు, ఛత్తీస్‌ఘడ్ నుంచి భద్రాచలం ఏజెన్సీకి వలస వచ్చిన గొత్తికోయలు ఈ కోవకు చెందిన దౌర్భాగ్యులు. వారి గుడిసెలను అటవీశాఖ అధికారులు

పదే పదే తగలబెట్టి వారిని తరిమేసే ప్రయత్నం చేస్తున్నారు.

వీరంతా అంతకు ముందు నుంచి అడవులలో నివసిస్తున్నవారే అయినప్పటికీ వీరు కొత్తగా నరికిన అడవి భూమి 1980 తరువాత నరికినది కాబట్టి, అటవీ సంరక్షణ చట్టం ప్రకారం ఆ భూమి మీద వారికి యాజమాన్య హక్కు ఇవ్వడానికి వీలులేదు. అంటే వాళ్లు శాశ్వతంగా 'చొరబాటు'దార్లే.

## 'చొరబాటు' కాదు, 'వివాదం'

అడవులపైన ప్రభుత్వానికి సకల హక్కులూ కల్పించే చట్టాలేవీ లేక ముందునుంచీ కూడ ఈనాటి ఆదివాసుల పూర్వీకులు అడవులలో ఉంటున్నారని పైన అన్నాం. వెనక వచ్చిన చట్టం ముందునుంచీ అక్కడ ఉన్న ఆదివాసులను చొరబాటుదార్లు, లేక కబ్జాదారులు అనడం హాస్యాస్పదం అన్నాం. కాబట్టి చట్టమే అడవులలో అసలయిన చొరబాటుదారు అని ఆదివాసులు ప్రకటించి, చట్టాన్నీ దాన్ని చేసిన రాజ్యాన్నీ అడవుల నుంచి వెళ్లిపొమ్మని ఆదేశించినా వారిని నైతికంగా ఎవరూ తప్పుపట్టలేరు.

అయితే ప్రస్తుత పరిస్థితులలో ఇది ఆచరణాత్మకమైన వైఖరి కాబోదు. ఇప్పుడు ముంచుకొస్తున్న విపత్తును ఎదుర్కొనడానికి, ఇదే ఆదివాసులు అనుసరించవలసిన వైఖరి అని సలహా ఇవ్వడానికి కావలసిన బలం ఆదివాసీ సమాజంలో గానీ ఉద్యమాలలో గానీ లేదు. అటవీ సంరక్షణ పేరు మీద ప్రభుత్వం ఏకపక్షంగా అడవులపైన తన అధికారాన్ని ప్రకటించుకోవడానికి వీలులేదనీ అడవులలో అనాదిగా నివసిస్తున్న ప్రజల హక్కులను గౌరవించే పద్ధతిలో వ్యవహరించాలనీ అనడం ఆచరణాత్మకం కాగలదు. ఇంకొకరకంగా చెప్పాలంటే ఆదివాసుల ఉనికినిగానీ వెనక వచ్చిన చట్టాన్ని గానీ 'చొరబాటు' అని పిలిచే బదులు, ఈ రెండింటి మధ్య ఒక వివాదం ఉందని గుర్తించి న్యాయబద్ధంగా పరిష్కరించే మార్గాలు వెతకడం ఉచితంగా ఉంటుంది.

1987-89 కాలంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషనర్ అయిన బి.డి.శర్మ గారు రిజర్వ్ ఫారెస్టులో ఆదివాసుల భూమి హక్కు గురించి ఒక నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. దానిలో ఆయన 'చొరబాటు' స్థానంలో 'వివాదం' అన్న మాటను ప్రవేశపెట్టి న్యాయబద్ధమైన పరిష్కారాలు సూచించే ప్రయత్నం చేసారు. ఆ నివేదికను అనుసరించి 1990లో కేంద్ర అటవీ శాఖ ఆరు సర్క్యులర్‌లు జారీచేసింది. ఆ నివేదికనూ సర్క్యులర్‌లనూ ఇప్పుడందరూ మరచిపోయారు కాబట్టి వాటినొకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. అవి పూర్తి న్యాయం చేయవుగానీ ఆదివాసుల హక్కుల పరిరక్షణ ప్రయత్నం ముందుకు పోవడానికి ఒక ప్రాథమిక భూమికను కల్పిస్తాయి.

అప్పటికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ఇంకా సవరించబడలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న సవరణ 1990లో జరిగింది. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఈ సవరణ నుంచి

పుట్టింది. సవరించిన ఆర్టికల్ 338 ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన విధాన నిర్ణ యాలు ఏవి తీసుకోవాలన్నా ప్రభుత్వం జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించి తీరాలి.

అంతకు ముందు ఆర్టికల్ 338 కింద ఒక ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ ఆఫీసర్ మాత్రం (అతనినే 'కమిషనర్' అనేవారు) ఉండేవారు. సవరించిన ఆర్టికల్ 338 జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఇచ్చిన విశేష అధికారాలు, ప్రాధాన్యం, అప్పటి ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్‌కు లేవు. ఆ అధికారి కేంద్ర ప్రభుత్వానికి ఒక సలహాదారు మాత్రమే.

అయినప్పటికీ ఆ స్థానంలో నియమితులయిన సీనియర్ ఐఎఎస్ అధికారి బి.డి.శర్మ గారు తనకున్న పరిమితమైన అధికారాలతో ఆదివాసుల భూమి హక్కును కాపాడడానికి చాలా కృషిచేసారు. అందులో ముఖ్యమైనది, ఆయన ఆధ్వర్యంలో ప్రకటించిన 29వ ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ నివేదిక.

> 'అడవులు, భూమి ప్రజల మనుగడకు భూమిక. మనుగడ ప్రజల ప్రాథమిక హక్కు. ఆదివాసీ ప్రాంతాలలో ఈ జీవించే హక్కుకే విఘాతం కలుగుతున్నది. ప్రాథమిక హక్కులతో ఈ చెలగాటం ఆగాలి. అయితే అడవులు నాశనం కాకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు కూడ తీసు కోవాలి. ఇది ఆదివాసులను ప్రభుత్వం అణిచివేసే రూపంలో ఉండ కూడదు. ఆదివాసులను అర్థం చేసుకొని వారికి సమాన భాగస్వామ్యం కలిగించే పద్ధతిలో ఉండాలి'

అనే వాక్యాలు ఆ నివేదిక దృక్పథాన్ని ప్రకటిస్తాయి.

అప్పటికి నెలకొని ఉన్న పరిస్థితిని ఆ నివేదిక సమీక్షించింది. 1980కి పూర్వం చాలా రాష్ట్రాలకు అడవి భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించే విధానం ఒకటి ఉండిందనీ, అయితే అది పూర్తయ్యే లోపలే 1980 చట్టం రావడంతో అవి అర్ధాంతరంగా ఆగిపోయాయనీ నివేదిక గుర్తించింది. ఉదాహరణకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1978 నాటికి ఆక్రమణలో ఉన్న ఆదివాసీ భూములన్నిటికీ పట్టా ఇవ్వాలని నిర్ణయించింది. కానీ అది అమలు అయ్యేలోపలే 1980 చట్టం వచ్చి క్రమబద్ధీకరణను చట్టవిరుద్ధం చేసింది. రాజస్థాన్ ప్రభుత్వం 1971 నాటికి ఆదివాసుల ఆక్రమణలో ఉన్న అటవీ భూములను, మహారాష్ట్ర ప్రభుత్వం 1979 నాటి ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించాయి. ఆ నిర్ణయాలు అమలుకాకముందే 1980 వచ్చేసింది. కాబట్టి 1980కి పూర్వం (అంటే పార్లమెంటు అటవీ సంరక్షణ చట్టం చేయక పూర్వం) ఉనికిలో ఉన్న క్రమబద్ధీకరణ విధానాలకు ఆ చట్టంలోని నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని 29వ ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ నివేదిక సూచించింది. ఈ సూచనను అనుసరించి కేంద్ర ప్రభుత్వం 1990లో ఒక సర్క్యులర్ జారీచేసిందని పైన చెప్పాము. ఆ సర్క్యులర్ నంబరు 13-1/90 - ఎఫ్‌పి(1), తేది 18.9.1990.

అయితే సమస్య అక్కడితో తీరిపోదు. కొన్ని రాష్ట్రాలకు మాత్రమే 1980కి పూర్వం ఒక క్రమబద్ధీకరణ విధానం ఉండింది. అన్ని రాష్ట్రాలకూ లేదు. ఆ విధానం ఉన్న రాష్ట్రాలు సహితం క్రమబద్ధీకరణకు అర్హులుగా గుర్తించడానికి న్యాయబద్ధమైన ప్రమాణాన్ని ఎంచుకున్నాయా లేదా అన్నది రెండవ ప్రశ్న. 1980 తరువాత ఆక్రమించుకున్న భూముల మాట ఏమిటన్నది మూడవ ప్రశ్న. వీటిలో ఒక ఉపప్రశ్న ఏమిటంటే సాంకేతిక కారణాల వల్ల పట్టా ఇవ్వడానికి వీలులేని భూములు సాగు చేసుకుంటున్న వారి మాట ఏమిటన్నది. ఇది ప్రధానంగా కొండవాలు భూములలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసులకు సంబంధించిన సమస్య. గ్రేడియెంట్ 15కు మించి ఉన్న భూములలో స్థిర వ్యవసాయానికి పట్టాలు ఇచ్చినట్టయితే వర్షం కురిసినప్పుడు భూసారం కిందికి కొట్టుకుపోయి భూమి సార విహీనం కావడం, కింది భాగంలో ఇసుక మేటలు వేయడం జరుగుతుంది కాబట్టి అటువంటి భూములలో పట్టా ఇవ్వడం సాంకేతిక కారణాల వల్ల అవాంఛనీయంగా పరిగణించ బడుతున్నది. ఇంకొక ఉపప్రశ్న కూడ ఇక్కడ ఉంది. అడవిలో భూమి హక్కే కాక అటవీ సంపద మీద ఇతర హక్కులు కూడ ఉంటాయి. వాటి మాటేమిటనేది కూడ ప్రశ్నే.

> అడవి భూముల మీద ప్రజల హక్కులకు సంబంధించిన ప్రశ్న చాలా సంక్లిష్టమైనది. దానికి చాలా కోణాలున్నాయి. కాబట్టి ఈ సమస్యను దశల వారీగా పరిష్కరించాలి. ప్రజల హక్కుకు రెండు పార్శ్వా లుంటాయి. ఒకటి అనుభవం హక్కు. రెండవది చట్టపరమైన హక్కు. ఇక్కడ చట్టపరమైన సమస్యలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. చట్టం ఎల్లప్పుడూ సరయినదేనని భావించనక్కరలేదని ఇదివరకే చెప్పాము.

అనే ఉపోద్ఘాతంతో బి.డి.శర్మగారి నివేదిక ఈ సమస్యలను దశల వారీగా చర్చించి కొన్ని సూచనలు చేసింది.

అడవిలో ఒక భాగాన్ని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించేసరికే తమ హక్కులకు గుర్తింపు పొందిన వారు ఆమేరకు అదృష్టవంతులు. వాళ్ల భూమిని అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్టు నుంచి మినహాయించడమైనా చేయాలి, లేదా నష్టపరిహారమయినా ఇవ్వాలి. ఆ అవకాశం చేయిజారిన వారికి అటువంటి భరోసా లేదు.

ఒక భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించే ముందు ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టంలోని సెక్షన్ 4 కింద అటవీ శాఖ నోటీసు ఇవ్వాలి. ఆ భూమి మీద తమకు హక్కు ఉందని అభ్యంతరం తెలిపే అవకాశం ప్రజలకు ఇవ్వాలి. దానిపైన విచారణ జరపడానికి ఆర్‌డివో ర్యాంకు అధికారిని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా ప్రభుత్వం నియమిస్తుంది. కేవలం భూమి యాజమాన్య హక్కే కాక, అటవీ సంపదను అనుభవించే హక్కు, అడవిగుండా ప్రయాణించే హక్కు, అడవిలోని జలాశయాలను నీటి వనరుగా వినియోగించుకునే హక్కు మొదలయిన అన్నిటి గురించీ అభ్యంతరాలు లేవదీయవచ్చు. అన్నిటికీ కూడ రిజర్వేషన్

నుంచి మినహాయింపయినా లేక నష్టపరిహారమైనా ప్రభుత్వం ఇయ్యవలసి ఉంటుంది. ఈ క్రమం ఒకసారి ముగిసిన తరువాత ఇంక ఆ భూభాగంలో ఎవరికీ ఏ హక్కులూ ఉండవు.

ఈ క్రమంలో తమ యాజమాన్య హక్కుకు గుర్తింపు పొందిన వారిని 1980లో జారీ అయిన కేంద్ర అటవీ సంరక్షణ చట్టం కూడ ఏమీ చేయజాలదు. అయితే ఈ క్రమం కాగితం మీద ఉన్నంత సుందరంగా ఆచరణలో ఉండదు. అటవీ శాఖ జారీచేసిన నోటీసును అర్థం చేసుకొని, దాని పర్యవసానాలు గ్రహించి, ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టాన్ని చదివిన వకీలునో వకీలు గుమాస్తానో పట్టుకొని తమ అభ్యంతరాలు లిఖితపూర్వకంగా పెట్టి, ఆపైన జరిగే విచారణలో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవడం ఆదివాసులకు చాలా కష్టం. చట్ట సభ ఒక చట్టాన్ని జారీచేసి గెజెట్‌లో అచ్చువేసిన తరువాత ఆ చట్టం అందరికీ తెలిసినట్టేనని భావించే దరిద్రపు న్యాయసూత్రం ఒకటి అమలులో ఉంది. ఆ చట్టాన్ని ప్రజలకు తెలియజెప్పే బాధ్యత ప్రభుత్వం పైన పెట్టి ఆ పైన అందరికీ తెలిసినట్టేనంటే అర్థం ఉందిగానీ అదేమీ లేకుండానే అందరికీ తెలిసినట్టేనని న్యాయ సిద్ధాంతం భావిస్తుంది కాబట్టి 'నాకు తెలియలేదు, అందువల్ల నా హక్కులను నేను కాపాడుకోలేదు' అని మొత్తుకున్నా చట్టం ఒప్పుకోదు.

ఈ రకంగా హక్కులు రుజువు చేసుకోలేకపోయిన వారిపైన బి.డి.శర్మ గారి రిపోర్టు మొదట దృష్టి సారించింది.

> ఒక భూభాగంలో అటవీ చట్టం కింద రిజర్వేషన్ ప్రకటించక ముందు నుంచి వ్యవసాయం చేసుకుంటున్న వారు, నివసిస్తున్న వారు ఉంటారు. వివిధ కారణాల వల్ల రిజర్వేషన్ ప్రకటించిన ప్రక్రియ వారి హక్కులను విస్మరించి ఉంటుంది. ఇటువంటి ప్రజలను ఎట్టి పరిస్థితిలోనూ చొరబాటుదార్లు అనడానికి వీలులేదు. వీరిలో ఆదిమ ఆదివాసీ తెగల వారు, పోడు వ్యవసాయం చేసుకునే వారు ఉంటారు. ప్రజల హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా అటవీ చట్టం కింద రిజర్వేషన్ ప్రకటించిన అన్ని కేసులూ దీని కిందికి వస్తాయి. ఈ ప్రజలను ఎట్టి పరిస్థితిలోనూ అడవుల నుంచి తరిమివేయడానికి వీలులేదు.

అని నివేదిక అంటుంది.

ఒక భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించే ప్రక్రియ (రిజర్వేషన్ ప్రక్రియ అని క్లుప్తంగా అందాం) మొదలయి, ఇంకా పూర్తికాకుండా ఉండిపోయిన ప్రాంతాలలో బతుకుతున్న వారిపైన నివేదిక తదుపరి దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం, ఒకసారి అటవీ శాఖ సెక్షన్ 4 కింద నోటీసు ఇచ్చి ఆ ప్రక్రియను ప్రారంభించిన తరువాత ఇంక కొత్తగా అక్కడ ఎవరికీ హక్కులు పుట్టవు. ప్రక్రియలోని ఒక్కొక్క ఘట్టానికి సంబంధించిన గడువు తీరిపోయిన తరువాత దానిని తిరగదోడడం జరగదు. అయితే

బి.డి.శర్మగారి నివేదిక, అసంపూర్ణంగా ఉన్న అడవుల రిజర్వేషన్ ప్రక్రియను తిరగదోడి అక్కడ ఉంటున్న వారికి తమ హక్కులు రుజువు చేసుకొనడానికి ఇంకొక అవకాశం ఇప్పించే ప్రయత్నం చేస్తుంది.

> (i) రిజర్వేషన్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న కేసులు, (ii) ప్రక్రియలోని అన్ని ఘట్టాలూ ముగిసినప్పటికీ తుది ప్రకటన వెలువడని కేసులు, (iii) రిజర్వేషన్ ప్రక్రియలో ఏదో ఒక మౌలిక లోపం ఉండడం వల్ల ప్రజల హక్కులకు సంబంధించి సరైన నిర్ణయం తీసుకోలేకపోయిన కేసులు ఉంటాయి. ఇటువంటి భూభాగాలలో ఉంటున్న ప్రజలందరినీ చొరబాటుదార్లు అనడం సరయినది కాదు. రిజర్వేషన్ ప్రక్రియ తప్పుగా జరిగినట్టుగాని, ప్రజల హక్కులను పరిగణనలోకి తీసుకోనట్టుగానీ రుజువయిన పక్షంలో హక్కులను నిర్ధారించే ప్రక్రియను తిరగదోడడం ఉచితంగా ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తు ఈరోజు కోర్టులు జోక్యం చేసుకుంటే తప్ప అది సాధ్యంకాదు. లేని పక్షంలో ప్రజల పక్షాన న్యాయం ఉన్నప్పటికీ ప్రక్రియను తిరిగి ప్రారంభించడం జరగదు. రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని స్థానిక పరిస్థితులను బట్టి స్పష్టమయినట్టయితే దానిని పునఃప్రారంభించాలి. కోర్టు జోక్యం కోసం ఆగకూడదు.

అని అంటుంది.

మరొక రకం బాధితులు కూడ ఉంటారు. వీరికి సంప్రదాయకంగా అటవీ భూమిపైన హక్కు లేకపోవచ్చు. కానీ ప్రభుత్వమే వీరికి భూములు లీజుకు ఇచ్చి ఉండవచ్చు. ఉదాహరణకు మన రాష్ట్రంలో డి ఫారం పట్టాలు ఈ కోవకు చెందినవి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ (బహుశా ఈనాటి ఛత్తీస్‌ఘడ్ కావచ్చు)లలో ఇటువంటి భూములు పెద్ద మొత్తంలో ఉన్నాయి. ఈ లీజులను క్రమబద్ధీకరించి ఆ ప్రజలకు హక్కులు కల్పించాలని నివేదిక అంటుంది.

> అటవీ శాఖ అభ్యంతరం చెప్పినప్పటికీ ప్రజలకు శాశ్వత లీజులో, తాత్కాలిక లీజులో సంబంధిత చట్టాన్ని అనుసరించి ప్రభుత్వం ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈ ప్రజలను చొరబాటుదార్లు అనడం, వారిపైన చర్య తీసుకోవడం తప్పు. వారి హక్కును లీజు పత్రాల ఆధారంగా గుర్తించాలి. వారి మధ్య ఏవైనా వివాదాలుంటే సంబంధిత ప్రభుత్వ శాఖ వాటిని పరిష్కరించాలి. చివరిగా ఆ ప్రజలకే ఆ భూములపైన హక్కులు కల్పించాలి.

అని నివేదిక అంటుంది.

వీటిలో ఏ కోవలోకీ రాకున్నప్పటికీ – అంటే అటవీ భూముల రిజర్వేషన్ ప్రక్రియలో

ఏ రకంగానూ హక్కులు స్థిరపడకున్నప్పటికీ - అడవులలో భూమి అనుభవిస్తున్న వారి సంగతి ఏమిటి? ఇందులో రెండురకాలు ఉన్నారని నివేదిక గుర్తించింది.

> ఏ అధికారమూ, ఏ హక్కులూ లేకుండ అడవులలో భూమిని ఆక్రమించుకొని బతుకుతెరువు పొందుతున్న వారి సంగతి చివరిగా చూడాలి. అయితే ఇందులో కూడ రెండు రకాలున్నారు. ప్రభుత్వం ఇప్పటికే పట్టాలు ఇవ్వాలని నిర్ణయించుకొని ఏదో కారణంగా చేతికి ఇంకా పట్టాలు అందని వారు ఒక రకం.

వీరికి పట్టాలు ఇచ్చెయ్యాలని నివేదిక అంటుంది. ఆఖరున మిగిలేది ఆ ఆసరా కూడా లేనివారు. వీళ్లకు ప్రస్తుతం ఉన్న చట్టాల పరిధిలో అడవి భూములపైన హక్కులు కల్పించడం సాధ్యపడదని బి.డి.శర్మ గారి నివేదిక గుర్తించింది. అయితే వీరిలో కూడా మళ్లీ కొన్ని ఉపవర్గాలు ఉన్నాయని అంటుంది. కొందరు అనుభవిస్తున్న భూములు ఏటవాలు భూములు కావడం వల్ల పట్టాలు ఇవ్వడం సాధ్యపడదు. కొందరు ఇతరత్రా బాగా భూములు కలిగి ఉండి అటవీ భూములను పొలాలుగాను, ప్లాంటేషన్లు గాను ఆక్రమించుకున్న గిరిజనేతరులు. వీరికి ఎట్టి హక్కులూ కల్పించకూడదనీ, ఒకవేళ ఈ ప్లాంటేషన్లు ముందు నుంచి ఉన్నట్టయితే వాటిని చిన్న కమతాలుగా విడగొట్టి అందులో పనిచేసే కార్మికులకు పంచాలనీ నివేదిక అంటుంది.

అయితే వీరే కాక, ప్రస్తుత చట్టాలు, విధానాల పరిధిలో హక్కులు కల్పించడం వీలుకాని ఆదివాసులూ ఉంటారు. వారి సంగతేమిటంటే వారికి సంతృప్తిని ఇచ్చే పద్ధతిలో పునరావాసం కల్పించిన తరువాతే వారిని తొలగించాలని నివేదిక అంటుంది.

> పైన చెప్పిన ప్రతిపాదనలన్నిటినీ ఒక నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ఒక ఆదివాసీని తన భూమి నుంచి తొలగించే ముందు, తాను మనస్ఫూర్తిగా స్వీకరించగల ప్రత్యామ్నాయాన్ని కల్పించాలి. భూమి విడిచిపెట్టి పోవడం మనిషి జీవన్మరణ సమస్య. అంతేకాక, ఆదివాసులకు తమ పరిసరాలలోని వనరులపైన ఉన్న హక్కు కూడ ఇక్కడ ఇమిడి ఉంది.

అని అంటుంది. అంతేకాక, ఒకపక్క అటవీ శాఖకూ ఆదివాసులకూ భూమి హక్కుల విషయంలో వివాదం నడుస్తుండగా అటవీ సిబ్బంది ఆదివాసులపైన కేసులు పెట్టడాన్ని బి.డి.శర్మగారి నివేదిక తీవ్రంగా గర్హించింది. అటవీ సిబ్బందికీ ఆదివాసులకూ మధ్య సాగే 'దాగుడు మూతలాట'ను నివేదిక చక్కగా వర్ణిస్తుంది. ఇది అన్ని ప్రాంతాలలోనూ మనకు కనిపించే చిత్రమే.

> విత్తనం వేసే సమయం దగ్గరపడే దాకా అంతా ప్రశాంతంగా ఉంటుంది. సమయం వచ్చేసరికి ఆదివాసులు పంట వేయదానికి భూమిని

> బాగుచేసుకోవడం మొదలుపెడతారు. వెంటనే అటవీశాఖ సిబ్బంది రంగంలోకి దిగి వారు సాగుచేయకుండా అడ్డం పడతారు. ఆదివాసులకు అది తప్ప వేరే జీవనాధారం లేదనీ, సాగుచేయక వారికి తప్పదనీ తెలిసీ అధికారులు ఈ పని చేస్తారు. సాగు చేయలేకపోతే ఆదివాసులు బతకలేరు కాబట్టి దానికోసం ఏమయినా చేస్తారు. లాఠీదెబ్బలు తింటారు. కోళ్లూ కల్లూ సమర్పించుకుంటారు. అన్నిటికీ సిద్ధపడతారు. ఇది ప్రతీ సంవత్సరం జరిగే తంతే కాబట్టి కుటుంబంలో ఒకరు జైలుకు పోయినా మిగిలిన వాళ్లు ఉండి వ్యవసాయం చేసుకోవచ్చునని వారు ఆలోచిస్తారు. ఒక్కొక్కసారి కోర్టును ఆశ్రయిస్తారు. అప్పుడప్పుడు అక్కడ న్యాయం దొరుకుతుంది. ఒక్కొక్కసారి ప్రభుత్వం వారి మొర ఆలకించి పంటను నాశనం చేయొద్దని తన సిబ్బందిని ఆదేశిస్తుంది. ఈ విధంగా కొన్నాళ్లు అలజడి బాగా జరిగిన తరువాత శాంతి నెలకొం టుంది. కానీ మరుసటి సంవత్సరం అదే కథ పునరావృతం అవుతుంది. దుర్మార్గమైన ఈ విషవలయాన్ని ఛేదించడానికి ఎక్కడా ఏ ప్రయత్నం జరగకపోవడం విచారకరం. ఆదివాసులకూ అటవీశాఖకూ మధ్యనున్న వివాదం అంతిమంగా పరిష్కారం అయేంతవరకు వారి మీద ఏ కేసులూ పెట్టకూడదు. వారిపాటికి వారిని సాగు చేసుకోనివ్వాలి.

అని నివేదిక అంటుంది. ఆదివాసుల భూమి హక్కు వివాదం పరిష్కారం అయ్యేంతవరకు వారిని ప్రశాంతంగా అక్కడే బతుకుతూ సాగుచేసుకోనివ్వాలనీ, క్రిమినల్ కేసులు పెట్టకూడదనీ, ఇప్పటికి పెండింగ్‌లో ఉన్న కేసులని వెనక్కి తీసుకోవాలనీ అంటుంది.

## అటవీ శాఖ సర్క్యులర్లు

ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ 29వ నివేదికను అనుసరించి కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ 1990 సెప్టెంబర్ 18వ తేదీన ఆరు సర్క్యులర్‌లు జారీచేసింది. అప్పటికి అటవీ సంరక్షణ చట్టం జారీ అయి పది సంవత్సరాలయింది. ఇకమీదట రిజర్వ్ ఫారెస్టులో ఎవరికీ హక్కులు కల్పించడానికి వీలులేదని ఆ చట్టం శాసించింది. కాబట్టి పది సంవత్సరాలుగా ఆదివాసుల భూమి హక్కు నిస్త్రాణంగా ఉంది. అప్పటిదాకా ఆయా రాష్ట్రాలు ఆదివాసుల హక్కులను గుర్తించడానికి అరకొరగా చేసిన ప్రయత్నాలు 1980లో హఠాత్తుగా ఆగిపోయాయి. వాటికి తిరిగి ప్రాణం పోసే ఉద్దేశంతో బి.డి.శర్మగారు రూపొందించిన నివేదిక సారాంశాన్ని పైన చూసాము.

తన సూచనలను అటవీ శాఖ చేత కొంతమేరకు ఆమోదింపజేయడం బి.డి.శర్మగారు సాధించిన విజయంగానే భావించాలి. అటవీ శాఖ సంస్కృతి పోలీసు సంస్కృతి. పోలీసుల లాగ ఖాకీ నిక్కర్లు వేసుకోవడం మాత్రమే కాదు, పోలీసుల లాగే వాళ్లు ఆలోచిస్తారు కూడ.

ప్రజలంతా దొంగలనీ గట్టిగా అణచి ఉంచకపోతే దేశాన్ని నాశనం చేస్తారనీ భావిస్తారు. అటువంటి వారిచేత తన సూచనలను ఎన్ని లొసుగులతోనయినా సరే బి.డి.శర్మగారు ఆమోదింపజేయగలగడం సామాన్య విషయం కాదు.

ఈ సర్క్యులర్ల నంబర్లు 13-1/90FP(1) నుంచి (6). వీటిలో మొదటి సర్క్యులర్ గురించి పైన చూసాము. కానీ ఇప్పుడు అన్నిటినీ ఒకచోట పరిచయం చేయడం ఉచితంగా ఉంటుంది. సర్క్యులర్ల భాషను ఉన్నదున్నట్టు అనువాదం చేసేబదులు వాటి సారాంశాన్ని తెలుగులో క్లుప్తంగా ఇస్తాము.

## 13-1/90 FP(1)

1980 అక్టోబర్ 25 కంటె ముందు నుంచీ రిజర్వ్ ఫారెస్టులో భూమి అనుభవిస్తూ ఉన్నవారికి ఇది వర్తిస్తుంది. ఆ తేదీ కంటె ముందు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఆక్రమణలను క్రమబద్ధం చేసే విధానం ఉండి ఉంటే, ఆ విధానం ప్రకారం వారి ఆక్రమణ క్రమబద్ధం చేయవచ్చు. ఇటువంటి ఒక్కొక్క కేసునూ సమీక్షించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ, అటవీ, సాంఘిక సంక్షేమ శాఖల అధికార్లతో ఒక కమిటీని వేయాలి.

అయితే ఇక్కడ రెండు సమస్యలున్నాయి. క్రమబద్ధీకరణ కోరుకుంటున్న అర్జీదారు 25 అక్టోబర్ 1980 కంటె ముందు నుంచీ ఆ భూమిని అనుభవిస్తున్నట్టు రుజువు చేయడానికి ఆ తేదీకి ముందు ఆ అర్జీదారుపైన అటవీ చట్టం కింద కనీసం ఒక్క కేసయినా నమోదయి ఉండాలి! వేరే ఏ ఆధారాలు చెల్లవు. అంతేకాక అప్పటి నుంచి ఇప్పటిదాకా వారు ఆ భూమిని అనుభవిస్తూ ఉండాలి. ఏ కారణంగానయినా దానిని వారు బీడు పెట్టినట్టయితే వారికి హక్కు రాదు.

ఇటువంటి హక్కుదార్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసి వారికి హక్కు కల్పించవలసిన భూమిని రిజర్వ్ ఫారెస్టు నుంచి మినహాయించమని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలి. ఎన్ని ఎకరాలను రిజర్వేషన్ నుంచి తొలగించమని కేంద్రాన్ని ఒక రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందో, మళ్లీ అంత భూమిని తాను వేరొకచోట అటవీ శాఖకు అప్పగించాలి.

1980 అక్టోబర్ 25 తరువాత రిజర్వ్ ఫారెస్టు భూమిని ఆక్రమించుకున్న వారికి ఎట్టి పరిస్థితిలోనూ హక్కు కల్పించకూడదు.

## 13-1/90 FP(2)

ఒక భూభాగాన్ని సంబంధిత రాష్ట్రాల అటవీ చట్టం కింద రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి నప్పుడు తమ హక్కుల గురించి సరయిన విచారణ జరగలేదనీ తమకు దక్కవలసిన పట్టాలు దక్కలేదనీ ఫిర్యాదు చేస్తున్న వారిని ఉద్దేశించి ఈ సర్క్యులర్ జారీచేశారు.

మూడు రకాల వివాదాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం పునస్సమీక్షించాలి.

(i) రాష్ట్ర అటవీ చట్టం నిర్దేశించిన పద్ధతిని పాటించకుండ ఒక భూభాగాన్ని 'రిజర్వ్ ఫారెస్టుగా

భావించబడేది' అని ప్రకటించిన కేసులు. అయితే అటువంటి భూమి ఆదివాసీ ప్రాంతానికి చెందినది గానీ మొత్తంగా గిరిజనేతర పేదలు నివసించేది గానీ అయినప్పుడు మాత్రమే ఈ పునస్సమీక్ష చేపట్టాలి. పైగా ఆ ఆదివాసులుగానీ గిరిజనేతర పేదలు గానీ ఇప్పుడింకా ఆ భూమిని అనుభవిస్తూ ఉండాలి. అన్యాయంగా తమ భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్టులో కలిపేసారని నిరాశ చెంది దానిని వదులుకొని వెళ్లిపోయి ఉన్నట్టయితే ఆ భూమిపైన పునస్సమీక్ష జరపనక్కరలేదు. ఏళ్ల తరబడి 'రిజర్వ్ ఫారెస్టు'గా తప్పుగా ప్రకటించిన భూమిని అంటిపెట్టుకొని, దెబ్బలు తింటూ కేసులు మోస్తూ ఉన్న వారికి మాత్రమే ఈ పునస్సమీక్ష దక్కుతుంది.

(ii) ఒక భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించిన క్రమం తప్పుడు రికార్డులు లేక పటాల మీద ఆధారపడినట్టుగానీ బాధితులకు సమాచారం ఇవ్వకుండ జరిగినట్టుగానీ ప్రాథమిక ఆధారాలున్నట్టయితే ఆ ప్రకటనను పునస్సమీక్షించాలి. అయితే ఇది కూడ ఆ బాధితులు ఆ భూమిని విడిచిపెట్టి పోకుండ కష్టనష్టాలకు ఓర్చి ఇంకా పట్టుకొని వేళ్లాడుతున్నట్ట యితేనే. ప్రభుత్వం తీసేసుకునింది కదా అని డీలాపడి దానిని విడిచిపెట్టి వెళ్లిపోయి ఉంటే అంతే సంగతులు.

(iii) ఒక భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించడానికి జరగవలసిన ప్రక్రియ పూర్తయిపోయి చాలా కాలమైనా ఇంకా తుది ప్రకటన వెలువడని సందర్భాలలో కూడ పునస్సమీక్ష చేయాలి. అయితే ఇదికూడ ఆ బాధితులు ఇంకా ఆ భూమిమీద ఉన్నట్టయితేనే.

ఈ మూడు సందర్భాలలోనూ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం పునస్సమీక్ష జరపవచ్చు. పునస్సమీక్ష ఫలితంగా ఒకవేళ రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించిన కొంత భూమిని ప్రజలకు అప్పగించేటట్టయితే ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేరొకచోట భూమిని అటవీ శాఖకు అప్పగించవలసి ఉంటుంది.

**13-1/90 FP(3)**

అదవి భూములలో ప్రభుత్వమే రైతులకు లీజు, అసైన్‌మెంట్, వివిధ రూపాలలో పట్టాలు ఇచ్చినప్పటికీ, అటవీ శాఖ ఆ లీజుల విషయంలో వివాదం లేవదీయడం వల్ల రైతులకు సమస్యలు ఉత్పన్నమయిన సందర్భాలున్నాయి. ఇది నిజానికి భిన్న ప్రభుత్వ శాఖల మధ్య వివాదం. ప్రజలు ఆ వివాదంలో నలిగిపోయే పరిస్థితి రావడం వల్ల బి.డి.శర్మగారి రిపోర్టు దాని గురించి మాట్లాడవలసి వచ్చింది. ఈ మూడవ సర్క్యులర్ అటువంటి కొన్ని వివాదాలను గుర్తించింది.

మధ్యప్రదేశ్‌లో (బహుశా ఇప్పటి ఛత్తీస్‌ఘర్ కావచ్చు) కొన్ని రక్షిత అడవులను రెవెన్యూ శాఖకు బదలాయించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, సరిహద్దులు నిర్ధారించి పట్టాలు ఇచ్చింది. అయితే ఆ అడవులను అటవీశాఖ నుంచి రెవెన్యూ శాఖకు బదలాయించాలన్న నిర్ణయం అమలు చేయలేదు. దానితో పట్టాలు పొందినవారు రక్షిత అడవులలో విలువలేని పట్టాలు గలవారయ్యారు. అటవీ శాఖ వారిని అక్కడి నుంచి తొలగిస్తానని బెదిరించడం

మొదలుపెట్టడంతో ఇదెక్కడి ఘోరమని ఆ పట్టాదారులు ఆందోళన చేశారు.

మహారాష్ట్రలో 'దాలి' భూములని ఉన్నాయి. ఇవి ఒక గ్రామానికి ఉమ్మడి అవసరాల కోసం ప్రభుత్వం అప్పగించిన భూములు. వాటిని ఆ గ్రామస్థులు సమష్టి ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. అయితే 1980లో అటవీ సంరక్షణ చట్టం వచ్చిన తరువాత భూముల స్థితి ఏమిటన్నది అస్పష్టంగా ఉంది. ఆ గ్రామస్థుల హక్కు కూడా అస్పష్టంగా ఉంది.

అనేక సందర్భాలలో రెవెన్యూ శాఖ తన భూమిగా భావించి పట్టాలు ఇచ్చేసిన భూమి తరువాత పరిశీలనలో అటవీ భూమిగా తేలినట్టు అటవీ శాఖ చెప్తుంది. (ఇటువంటి కేసులు మన రాష్ట్రంలోనూ చాలా ఉన్నాయి). అప్పుడు ఆ పట్టాదారులు అటవీ శాఖ నుంచి చాలా ఇబ్బందులు ఎదుర్కుంటారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వమిచ్చిన లీజుతో ప్రజలు భూమిని దున్నుకుంటుంటారు. ఆ లీజును 1980 తరువాత పునరుద్ధరించకపోయినా వాటి లీజు దారులు దానిని దున్నుకుంటూనే ఉంటారు. అటవీ శాఖ వచ్చి అది రిజర్వ్ ఫారెస్టని దబాయిస్తుంది. అప్పుడు ఆ ప్రజల హక్కులేమిటి?

ఈ రకమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ మూడవ సర్క్యులర్ జారీచేయబడింది. ఈ రకమైన పట్టాలన్నిటి గురించీ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష జరపాలనీ, ఆ పట్టాలు ఇచ్చిన అధికారికి తగిన అధికారం ఉండిందా లేదా అని పరిశీలించాలనీ అనింది. ఆపైన, ఆ పట్టాలు పొందినవారు ఆదివాసులు లేక గ్రామీణ పేదలు అయిన పక్షంలో, అవి వ్యక్తులకిచ్చిన పట్టాలయినా సమష్టిగా ఇచ్చినవయినా వాటిని గౌరవించాలనీ ప్రభుత్వ శాఖల మధ్య కొట్లాటలకు ఆ ప్రజలను బలిపెట్టకూడదనీ అనింది. అయితే ఆ ప్రజలు ఇంకా ఆ భూమిని అనుభవిస్తూ ఉన్నట్టయితేనే ఇది వర్తిస్తుంది. అది లీజుకిచ్చిన భూమి అయినట్టయితే, ఆ లీజు గడువు తీరిపోయినట్టయితే ఇది వర్తించదు.

అయితే 1980కి పూర్వం రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చి లీజు పొడిగించని భూమి విషయంలో లీజును పొడిగించే ఉద్దేశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి గానీ ఉన్నట్టయితే తగు ప్రతిపాదన రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించాలి అని అంటుంది. దానితోబాటు వేరే ఎక్కడయినా అంతే భూమిని రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖకు అప్పగించవలసి ఉంటుంది.

**<u>13-1/90 FP(4)</u>**

ఇది భూమికి సంబంధించిన సర్క్యులర్ కాదు. అయితే భూమి హక్కుకు అనుబంధంగా పనిహక్కు ఆదివాసులకు చాలా ముఖ్యమైనది కాబట్టి ఇందులోని అంశాలను వివరించడం కూడ అవసరమే.

అడవిలో అటవీశాఖ కల్పించే పని అడవివాసులకు ఒక ముఖ్యమైన జీవనాధారం. అందులో మధ్యవర్తులను తొలగించాలన్నది ఈ సర్క్యులర్ ప్రధాన లక్ష్యం. కాంట్రాక్టర్ల స్థానంలో ఆదివాసీ సహకార సంఘాలను, కార్మిక సహకార సంఘాలను, ప్రభుత్వ సంస్థలను నియమించాలని అంటూ ఈ సర్క్యులర్ ఈ క్రింది ఆదేశాలు జారీచేసింది.

1. స్థానిక ఆదివాసీ కార్మికులు అందుబాట్లో ఉన్నట్టయితే బయటి కార్మికులను తీసుకురాకూడదు.
2. బయటి నుంచి తీసుకొచ్చే కార్మికులను కాంట్రాక్టర్ల ద్వారా నియమించకూడదు.
3. కార్మికులు తక్కువగా ఉన్నట్టయితే ఆదివాసీ సహకార సంఘాల ద్వారా పనిచేయించాలి.
4. దిన వేతనం నిర్ణయించడానికి అటవీశాఖ నియమించే వేతన బోర్డులో గిరిజన సంక్షేమ శాఖ ప్రతినిధి ఒకరు ఉండాలి.
5. పీస్ రేట్ వేతనం ఇచ్చేటట్టయితే దాని ప్రమాణాలు నిర్ధారించడానికి వివరమైన విశ్లేషణ చేపట్టాలి.
6. పని ఎవరి ద్వారా చేసినా అందరూ కూడ ఒకేరకమైన పనికి ఒకే వేతనం ఇచ్చేటట్టు చూడాలి.
7. అడవిలో చేసే పనికి అటవీశాఖ, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ కనీస వేతనాల చట్టాన్ని అనుసరించాలి.

## 13-1/90 FP(5)

ఇది అటవీ భూమిలో ఉన్న ఆవాసాలకు సంబంధించిన సర్క్యులర్. నిజానికి రిజర్వ్ ఫారెస్టులో గ్రామాలు ఉండకూడదు. కానీ కొన్ని ఉన్నాయి. కొన్ని గ్రామాలను తొలినాడు ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. అడవి లోపలి ప్రాంతాలలో చేపట్టే పనికి కూలీలు అవసరం అవుతారు కాబట్టి కూలీలను తీసుకొచ్చి అడవిలో గుడిసెలు వేసుకొని స్థిరపడనిచ్చారు. కాలక్రమంలో రోడ్లు, రవాణా సౌకర్యాలు మెరుగయిన తరువాత ఇటువంటి ఆవాసాలు ఏర్పాటు చేయవలసిన అవసరం పోయింది గానీ పాత గ్రామాలు ఉండిపోయాయి. వాటిని 'అటవీ గ్రామాలు' అని ఈ సర్క్యులర్ పిలుస్తుంది. దేశంలో ఇటువంటివి 2500 నుంచి 3000 దాకా ఉన్నాయంటుంది.

అటవీ చట్టాలను పట్టించుకోకుండ అడవిలోనే తమపాటికి తాము నివసిస్తున్న వ్యవసాయ పూర్వదశకు చెందిన ఆదివాసుల గ్రామాలున్నాయి. వీటిలో కొన్ని అటవీ గ్రామాలుగా గానీ, రెవెన్యూ గ్రామాలుగా గానీ రికార్డులోకి ఎక్కి ఉండకపోవచ్చు. కొత్తగా ఆదివాసులు అడవి భూమిలోకి విస్తరించి వేసుకున్న గూడాలు కూడ ఉంటాయి.

వీటిని ఏం చేయాలో వివరించడానికి ఈ అయిదవ సర్క్యులర్ జారీచేసారు. 'అటవీ గ్రామాలు'గా గుర్తించిన వాటిలో నివసిస్తున్న వారికి ఆ భూమిపైన హక్కు కల్పించబడుతుంది. అయితే వారికి ఆ భూమిని వంశపారంపర్యంగా అనుభవించే హక్కే తప్ప దానిని అమ్ముకునే హక్కు ఉండదు.

25 ఏళ్లకు పైబడి అడవిలో ఉంటూ అటవీ గ్రామంగా గానీ, రెవెన్యూ గ్రామంగా గానీ గుర్తింపు పొందని ఆవాసాల విషయంలో వాటిలో నివసిస్తున్న ప్రజలతో ఏదో ఒక సామరస్య పూర్వకమైన ఒడంబడిక చేసుకోవాలి.

కొత్తగా అడవిలో వ్యవసాయం కోసం చొరబడి గ్రామాలు వేసుకున్న వారయినట్టయితే, ఒకవేళ వారి వ్యవసాయ భూములకు పట్టాలు ఇచ్చేటట్టయితే వారి గుడిసెలకు కూడ ఇయ్యవచ్చును.

పై రెండు కోవలకూ చెందని వారిని అడవుల నుంచి తొలగించి వేయాలి. అయితే వారు ఆదివాసులయినట్టయితే వారికి అడవి బయట ప్రభుత్వ భూమిలో పునరావాసం కల్పించాలి.

అయితే అడవులలో నివాస హక్కులు ఎప్పుడు కల్పించినా ఆమేరకు వేరేచోట ఆ రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖకు భూమిని కేటాయించాలి.

**13-1/90 FP(6)**

ఇది అడవి జంతువుల దాడివల్ల జరిగిన ప్రాణనష్టానికీ ఆస్తి నష్టానికీ నష్టపరిహారం కల్పించే ఆదేశం.

అడవులలోనూ అడవుల పరిసరాలలోనూ నివసించే ప్రజలు, వారి ఆస్తులు వన్యమృగాల దాడికి గురయిన సందర్భాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నష్టపరిహారం ఒకే రకంగా లేదని ఈ సర్క్యులర్ గుర్తించింది. చావుకు ఒరిస్సాలో 2000, బీహార్‌లో 20,000 ఇస్తున్నారని గుర్తించింది. మృతుల కుటుంబాల జీవనానికి కలిగిన నష్టాన్ని పూరించే విధంగా నష్టపరిహారం ఉండాలని అంటూ ఈ సర్క్యులర్ ఈ క్రింది సూత్రాలను ఆదేశించింది.

1. వన్యమృగాల దాడిలో చనిపోయినా, శాశ్వతంగా అశక్తులయినా 20,000 రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి.
2. తీవ్రంగా గాయపడినట్టయితే అందులో మూడవ వంతు ఇవ్వాలి.
3. స్వల్ప గాయమయితే చికిత్సకు అయిన ఖర్చు ఇవ్వాలి.
4. పశువులు చనిపోయినట్టయితే వాటి మార్కెట్ ధర కట్టియ్యాలి.
5. ఇళ్లు, పంటలు నాశనమయితే నష్టాన్ని అంచనా వేసి కట్టియ్యాలి.

ఈ నష్టపరిహారం మోతాదును ఎప్పటికప్పుడు సమీక్షించాలని కూడ సర్క్యులర్ అనింది.

## సర్క్యులర్‌లోని లోపాలు

29వ ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ రిపోర్టు నుంచి ఈ సర్క్యులర్‌లు పుట్టాయిగానీ ఆ రిపోర్టునూ ఈ సర్క్యులర్‌లనూ పోల్చి చూసినట్టయితే కొన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. కమిషనర్ రిపోర్టు వీలయినంతవరకు అడవులలోని ఆదివాసులకు హక్కులు కల్పించాలనీ లేనిపక్షంలో పునరావాసం కల్పించిన తరువాతే వారిని అడవి నుంచి తొలగించాలనీ సూచించగా, ఈ సర్క్యులర్‌లు వారికి హక్కులు కల్పించే విషయంలో కఠినమైన షరతులు పెడుతూ, హక్కుల కల్పనకు అర్హతలేని పక్షంలో పునరావాసం కల్పించడం కోసం ఆగకుండ వెంటనే అడవుల నుంచి తొలగించాలని ఆదేశిస్తాయి.

1. అడవులలో ఉంటున్న వారికి గానీ, వ్యవసాయం చేసుకుంటున్న వారికి గానీ పట్టాలు ఇవ్వాలని నిర్ణయించిన పక్షంలో ఆమేరకు భూమిని అటవీ శాఖకు వేరే ఎక్కడయినా ప్రభుత్వం ఇవ్వాలన్న నిర్ణయం ఒక ప్రతిబంధకం కాగలదు. అటువంటి భూమి ఎక్కడా అందుబాట్లో లేని కారణంగా వీరికి పట్టాలు ఇవ్వలేమని ప్రభుత్వం నిర్ణయించుకోవచ్చు.
2. అడవులలో నివసిస్తున్న వారి హక్కులను 1980 చట్టం ఒక్క దెబ్బతో తీసివేసిన తరువాత కూడ, వారు కేసులకూ నిర్బంధానికీ ఓర్చి ఇంకా ఆ భూములలో ఉన్నట్టయితేనే ఈ సర్క్యులర్ల పరిధిలో వారికి హక్కులు ఇవ్వడం జరుగుతుంది. చట్టం ఒత్తిడికి తట్టుకోలేక వారు ఆ భూమిని విడిచిపెట్టి పోయినట్టయితే ఇవ్వరు. ఇది చాలా విచిత్రమైన నియమం. 1980 చట్టం ఒక్క దెబ్బతో అడవివాసుల హక్కులన్నిటినీ తొలగించివేయడం అన్యాయమన్న స్పృహతోనే ఈ సర్క్యులర్లు జారీ అయ్యాయి. న్యాయమయినా అన్యాయ మయినా అప్పటికి పదేళ్లగా అదే చట్టం. చట్టాన్ని అందరూ గౌరవించక తప్పదు, గౌరవించకపోతే శిక్ష అనుభవించక తప్పదు. చట్టాన్ని పది సంవత్సరాలుగా ధిక్కరించిన వారికి మాత్రమే ఇప్పుడు న్యాయం చేస్తామనడంలో ఏమైనా అర్థం ఉందా?
3. పోనీ, వారు ఆ భూమిని ఈనాటి దాకా అనుభవిస్తున్నట్టు రుజువు చేసుకోవడానికి స్వతంత్రమైన ఆధారాలేవయినా అంగీకరిస్తారా అంటే లేదు. అటవీ శాఖవారు వారిపైన అక్రమ చొరబాటుకు కేసు బుక్‌చేసి ఉంటేనే అంగీకరిస్తారంట! చట్ట విరుద్ధంగా అడవులలో బతికేవారు ఏదో ఒకరకంగా కేసులు తప్పించుకోవడానికి తంటాలు పడుతుంటారు. అటవీ శాఖ సిబ్బందిని ప్రాధేయపడతారు లేదా కల్లుతోనో, కోడితోనో సంతృప్తిపరుస్తారు. ఆ స్థితిలో అదే తెలివయిన పనిగా ఎవరైనా భావిస్తారు. కానీ అటువంటి ప్రయత్నమేమీ చేయకుండ చట్టానికి ఛాతీ ఒడ్డి కేసులు పెట్టించుకున్న వారికి మాత్రమే ఇప్పుడు హక్కులు పొందే అవకాశం ఉంటుంది. సాధారణ సివిల్ కోర్టులు సహితం అంగీకరించే ఇతర సాక్ష్యాలను సహితం ఈ సర్క్యులర్లు గుర్తించవు.
4. ఇన్ని అవరోధాలు దాటి భూమి హక్కు పొందలేని వారికి పునరావాసం గ్యారంటీ లేదు. వారిని వెంటనే అడవుల నుంచి తొలగించి వేస్తారు. 'పునరావాసం కల్పించే విషయం ప్రభుత్వం పరిశీలించాలి' అని మాత్రమే ఈ సర్క్యులర్లు అంటాయి.

ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ, 'ఇక మీదట ఎవరికీ రిజర్వ్ ఫారెస్టులో భూమి మీద హక్కులు కల్పించడానికి వీలులేదు' అని 1980 అటవీ సంరక్షణ చట్టం నిర్ద్వంద్వంగా ప్రకటించిందని గుర్తుంచుకుంటే, మళ్లీ అడవి భూమిలో పట్టా పొందే హక్కుకు ఈ సర్క్యులర్లు తలుపులు తెరిచాయని అర్థం అవుతుంది. అదీ వీటి ప్రధాన ప్రాముఖ్యం. 29వ ఎస్సి, ఎస్టి కమిషనర్ రిపోర్టు ఈ విజయాన్ని సాధించింది. తెరిచిన ఈ ద్వారాలను క్రమంగా మరింత వెడల్పు చేసుకుంటూ ముందుకు పోవడం ఆదివాసీ ఉద్యమాలకు అసాధ్యం కాదు.

పైన పేర్కొన్న నాలుగు ప్రధాన లోపాలను తొలగించి 1990 నాటి ఆరు సర్క్యులర్లను వెనువెంటనే దేశవ్యాప్తంగా అమలు చేయడం మొదలుపెట్టాలని – ఇంకొకరకంగా చెప్పాలంటే

29వ ఎస్సీ, ఎస్టీ కమిషనర్ రిపోర్టులను యథాతథంగా అమలు చేయడం మొదలుపెట్టాలని – డిమాండ్ చేయడం దీనికి మొదటి మెట్టు కాగలదు.

## సుప్రీంకోర్టులో కేసు

అయితే లోపభూయిష్టమైన ఆ ఆరు సర్క్యులర్లను సహితం అమలుచేసిన పాపాన ఏ రాష్ట్ర ప్రభుత్వమూ పోలేదు. బి.డి.శర్మ గారితో పాటే అవి కూడ రిటైరయ్యాయి. అడవులలో భూములు అనుభవిస్తున్న ఆదివాసులు ఎప్పటిలాగే కొట్లాడిన కాడ కొట్లాడుతూ లొంగిపోయిన కాడ ఖాళీచేస్తూ లంచాలు మేపుతూ జైలుకు పోతూ ఉన్నారు. 1980 చట్టాన్ని ఒక్కసారిగా దేశమంతటా అమలు చేసేయడం అన్యాయమనుకోకపోయినా ఆచరణ సాధ్యంకాదని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ గుర్తించాయి కాబట్టి జీవితం ఎప్పటిలాగే సాగింది. ఈసారి దెబ్బ ఎక్కడి నుంచి పడుతుందా అని ఆదివాసులు, వారి సంఘాలు ఆదుర్దాగా ఎదురు చూసే ఉంటాయి. కానీ అది సుప్రీంకోర్టు ఆదేశాల రూపంలో నెత్తిన పడుతుందని మాత్రం ఊహించి ఉండరు.

తమిళనాడులోని కోయంబత్తూరు ప్రాంతానికి చెందిన గోదవర్మన్ తిరుమల్పాడ్ అనే ఎస్టేట్ యజమాని 1995లో సుప్రీంకోర్టులో ఒక కేసు వేసాడు. అతని కుటుంబానికి తరతరాలుగా అక్కడి అడవి ప్రాంతంలో ఎస్టేటు ఉండేది. అయితే తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం దానిని రిజర్వ్ ఫారెస్ట్‌లో కలిపేసి స్వాధీనం చేసుకుంది (నష్టపరిహారం చెల్లించే ఉంటారులెండి). అయితే అప్పటిదాకా తమ కుటుంబం ఆ ఎస్టేటులో జాగ్రత్తగా పెంచిన చెట్లు అటవీశాఖ నిర్లక్ష్యం వల్ల స్మగ్లర్ల పాలవుతుంటే చూస్తూ సహించలేక అతను కోర్టుకెక్కాడు. సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నెంబర్ 202/95 దాఖలు చేసాడు. 2002 సంవత్సరంలో ఆ కేసు అప్పట్లో దేశ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న కిర్పాల్ గారి బెంచి ముందుకు వచ్చింది. ఆయన దానిని మొత్తంగా దేశంలోని అడవుల సంరక్షణకు సంబంధించిన కేసుగా మార్చేసారు.

కిర్పాల్‌గారు చెట్లు నరకడాన్ని సహించదని ప్రతిష్ఠ. దేశంలోని అనేక ప్రాంతాలలో చెట్లు నరకడాన్ని 'స్టే' చేస్తూ ఆయన ఆర్డర్లు జారీచేసి ఉన్నాడు. అండమాన్ దీవులలో నిర్విచక్షణగా చెట్లు నరుకుతున్నారనీ దానిని ఆపాలనీ కోరుతూ సుప్రీంకోర్టులో కేసు వేసిన ఒక వకీలు తన అనుభవాన్ని ఈ విధంగా చెప్తాడు. కేసు పిలవగానే జస్టిస్ కిర్పాల్‌గారు 'అండమాన్లా? నేనింకా అండమాన్లకు స్టే ఇవ్వలేదా?' అంటూ ప్రభుత్వ వకీలు ఏదో మొత్తుకుంటున్నా వినకుండా స్టే ఇచ్చేసాడంట.

చెట్లను నరకడం కంటె అవి ఉండడమే శ్రేయస్కరమనడంలో సందేహం లేదు గానీ అది చెట్లతో మొదలయి చెట్లతో ముగిసే విషయం కాదు. ఈ సంగతి కిర్పాల్ గారికి అర్థమయినట్టు లేదు. గోదవర్మన్ తిరుమల్పాండ్ కేసును తన వృక్ష సంరక్షణ ఉద్యమానికి సాధనంగా మలచుకున్న కిర్పాల్ గారు అందుకు సహకరించడానికి హరీష్‌సాల్వే అనే సీనియర్ న్యాయవాదిని 'అమైకస్ క్యూరీ'గా నియమించారు. కోర్టుకు తగు సలహాలిచ్చే వకీలని ఆ మాటలకు అర్థం.

జడ్జిల మనసెరిగి వడుచుకోవడం ప్రతిభావంతులయిన లాయర్ల లక్షణం. కాబట్టి సాల్వేగారు 2001 సంవత్సరం నవంబర్ 23 నాడు 'దేశవ్యాపితంగా జరుగుతున్న అడవుల నరికివేత గురించి తగిన ఆదేశాలు జారీచేయవలసింది'గా కోర్టువారిని కోరుతూ గోదవర్మన్ కేసులో ఒక మధ్యంతర అర్జీ (ఐఏ నెం.703/2001) దాఖలు చేశాడు. 2002 ఫిబ్రవరి 18న కిర్పాల్‌గారి బెంచి ఆ అర్జీలో తొమ్మిది రాష్ట్రాలకు నోటీసు ఇచ్చింది. ఆ రాష్ట్రాలు ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, అస్సాం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కేరళ. (దేశంలో మూడవ అతిపెద్ద అటవీ భూభాగం గల ఆంధ్రప్రదేశ్‌ను ఏ కారణంగానో విస్మరించారు. అది ఒకందుకు మంచిదే అయింది. తరువాతి దినాలలో ఆదివాసుల తరఫున గోదవర్మన్ కేసులో చొరబడ్డ న్యాయవాదులకు కిర్పాల్‌గారు రిటైరయ్యే దాకా కేసును సాగదీయడానికిది ఉపయోగ పడింది.)

> అటవీ భూభాగంలో, మరీ ముఖ్యంగా కొండచరియలలో, అభయారణ్యాలలో, జాతీయ వనాలలో చొరబాట్లను నిరోధించడానికి ఏం చర్యలు తీసుకోవలసి ఉందో, ఇప్పటికి జరిగిన చొరబాట్లను తొలగించడానికి ఏం చర్యలు తీసుకున్నారో ఈ రాష్ట్రాలు భారత ప్రభుత్వం, నాలుగు వారాలలోగా సమాధానం దాఖలు చేయాలి.

అని ఆ ఆర్డర్‌లో సుప్రీంకోర్టు అనింది.

ఈ ఆర్డర్‌లో సుప్రీంకోర్టు అడవి భూముల రక్షణకు ఏం చేయాలో ఏం చేసారో చెప్పమనింది గానీ ఎవ్వరినీ తొలగించమని ఆదేశించలేదు. కోర్టులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వాలు ఒక పట్టాన అమలు చేయవనేది అందరికీ అనుభవమే. కోర్టులో ప్రభుత్వం మీద కేసు గెలిచిన వారు ఆ తరువాత మరొక కోర్టు ధిక్కారం కేసు వేసుకొని కోర్టు తీర్పును అమలు చేయించుకోవాలి.

అటువంటిది సుప్రీంకోర్టు కేవలం ఏం చేసారో చెప్పమని నోటీసు ఇవ్వగానే కేంద్ర అటవీ శాఖ మే నెల 5వ తేదీన చొరబాటుదార్లందరినీ సెప్టెంబర్ 30లోగా తొలగించి వేయాలంటూ సర్క్యులర్ జారీచేసింది. కిర్పాల్‌గారి చెట్ల పరిరక్షణా కాంక్ష వారి దృష్టికి మంచి అవకాశంగా కనిపించినట్టుంది. ప్రపంచీకరణ విధానాలు మొదలుపెట్టినప్పటి నుండి అన్నిరకాల వనరులనూ ప్రజలకు దూరం చేస్తున్న మన పాలకులు అడవుల నుండి ఆదివాసులను బలప్రయోగంతో దూరం చేయడానికి కొంత తటపటాయిస్తున్నట్టున్నారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో ఆసక్తి తీసుకుంటున్నదని తెలియగానే వారికి ధైర్యం వచ్చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన నోటీసులో గానీ ఆ నోటీసుకు భూమిక అయిన హరీష్ సాల్వే గారి మధ్యంతర అర్జీ పత్రంలో గానీ చొరబాటు, చొరబాటుదార్లు అన్న పదాలే తప్ప ఆదివాసులు అన్న ప్రయోగం ఎక్కడా లేకపోవడం వారికి బాగా ఉపకరించింది. గతంలో అడవిలో చొరబాట్ల గురించి ఎప్పుడు మాట్లాడినా తప్పనిసరిగా ఆదివాసులను, వారి హక్కులను

విడిగా ప్రస్తావించిక తప్పని అటవీ శాఖకు మొదటిసారిగా ఆ ఇబ్బంది లేకుండ నిర్భయంగా అందరు చొరబాటుదార్లనూ గెంటివేయమని ఆదేశించే అవకాశం సుప్రీంకోర్టు ఇచ్చింది.

> దేశంలో అడవి భూములలో చొరబాటు సమస్య తీవ్రరూపం తీసుకున్న విషయం మీ దృష్టికి తీసుకొస్తున్నాను. ఈ చొరబాట్లు కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు చొరబాటు దార్లపైన సంబంధిత చట్టాల కింద సత్వర చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కోరుతూ ఉంది. ఈ చొరబాట్లకు పాల్పడేది ఎక్కువగా బలవంతులయిన కబ్జాదారులు. ముఖ్యంగా, అడవి లోతట్టు ప్రాంతాలలో వీరు ఇక్కడ కొంత అక్కడ కొంత అడవులు నరికివేయడం అటవీ సంరక్షణకు చాలా హాని కలిగిస్తున్నది. జాతీయ వనాలు, అభయారణ్యాలను కలిపే అడవి మార్గాలలో చొరబాట్లు జరగడం వాటికి చాలా నష్టం చేస్తున్నది. ఏ కారణంగానే చొరబాటు దార్లపైన అటవీ సిబ్బంది సకాలంలో చర్యలు తీసుకోవడం లేదు. అది ఇతర చొరబాటుదార్లకు ప్రోత్సాహం కలిగిస్తున్నది. వివిధ రాష్ట్రాల నుంచి లభిస్తున్న సమాచారం ప్రకారం దేశంలో సుమారు 12.5 లక్షల హెక్టార్ల అడవి భూమి చొరబాటుకు గురయి వుంది. ఇంకా గుర్తించని చొరబాట్లు ఉండవచ్చు.
>
> వినాశకరమైన ఈ పరిస్థితిని గౌరవ సుప్రీంకోర్టు సహితం గుర్తించింది. రిట్ పిటిషన్ నెం. 202/95 లోని ఐఏ నెం. 703లో 2001 నవంబర్ 23న సుప్రీంకోర్టు జారీచేసిన ఆర్డర్‌లో కేంద్ర ప్రభుత్వం చొరబాట్లను క్రమబద్ధీకరించకూడదని ఆదేశించింది. చొరబాట్లన్నిటినీ తొలగించ డానికి ఒక కాలపరిమితి నిర్దేశించుకొని ప్రణాళిక రూపొందించుకో వలసి ఉంది.

అంటూ కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ తరఫున ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ వి.కె.బహుగుణ జారీచేసిన సర్క్యులర్ అంటుంది.

ఇందులో ఒక అచ్చుతప్పు, ఒక అర్ధసత్యం, ఒక అబద్ధం ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆర్డర్ జారీచేసింది 2001 నవంబర్ 23న కాదు, 2002 ఫిబ్రవరి 18న. ఇది పొరబాటనుకుందాం. అయితే ఆ ఆదేశంలో సుప్రీంకోర్టు చొరబాట్లను ఎక్కడా క్రమబద్ధీకరించవద్దని చెప్పిందనడం అబద్ధం. కేవలం చొరబాట్లను తొలగించడానికి, నిరోధించడానికి ఏం చేశారో చెప్పమని మాత్రమే సుప్రీంకోర్టు అనింది.

ఇంక అర్ధసత్యమేమిటంటే ఒక పక్క బలవంతులయిన చొరబాటుదార్ల గురించి మాట్లాడుతూ మరొకపక్క దేశంలోని 12.5 లక్షల హెక్టార్ల అటవీ భూమిలోని చొరబాటుదార్లం దరినీ తొలగించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలనడం. ఆ 12.5 లక్షల

హెక్టార్లూ బలవంతుల ఆక్రమణలోనే ఉన్నాయన్న అభిప్రాయాన్ని తద్వారా సర్క్యులర్ కలిగిస్తుంది. ఇది అవాస్తవం. 'చొరబాటుదార్ల' చేతిలో ఉన్నది 12.5 లక్షల హెక్టార్లో అంతకంటె ఎక్కువోగానీ (ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రెండు లక్షల హెక్టార్ల అడవి భూమి ఆదివాసులు, ఇతర పేదల 'ఆక్రమణ'లో ఉందని మన రాష్ట్ర ప్రభుత్వం అంచనా. కేంద్ర ప్రభుత్వం లెక్కగట్టిన 12.5 లక్షల హెక్టార్లలో దీనిని చేర్చారో లేదో తెలీదు) అందులో అధిక భాగం ఆదివాసులు లేక ఇతర పేదల అనుభవంలో ఉందనేది వాస్తవం. వారినందరినీ నిర్దయగా తొలగించడానికి ఆ భూమి అంతా 'బలవంతుల' చేతిలో ఉన్నట్టు చూపడం కేంద్ర అటవీ శాఖ అనుసరించిన అర్ధసత్యం.

పైన ఉటంకించిన ఉపోద్ఘాతంతో తన కార్యాచరణ ప్రణాళికను ఆ సర్క్యులర్ ఈ విధంగా ప్రకటించింది.

1. 1990 సెప్టెంబర్ 18న కేంద్ర మంత్రిత్వ శాఖ జారీచేసిన సర్క్యులర్ నెం. 13.1/90-FP(1) కింద క్రమబద్ధీకరణకు అర్హులుకాని చొరబాటుదార్లందరినీ 2002 సెప్టెంబర్ 30 లోపల తొలగించివేయాలి.
2. అడవి భూములలో చొరబాట్లను ఎప్పటికప్పుడు తొలగించే ప్రక్రియ రూపకల్పనకు, అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రధాన చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయంలో ఒక కమిటీని నియమించాలి.
3. చొరబాటు కేసులను విచారించడానికి తగిన అధికారాలు అటవీశాఖ అధికార్లకు సంబంధిత చట్టాల కింద కల్పించాలి. సత్వర విచారణల ద్వారా నియమిత కాలపరిధి లోపల చొరబాటుదార్ల తొలగింపు ప్రక్రియను ముగించడానికి కావలసిన చర్యలు చేపట్టాలి.
4. రాష్ట్ర స్థాయిలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక పర్యవేక్షక కమిటీని నియమించాలి. ఆ కమిటీ రెండు సంవత్సరాల కొకసారి సమావేశమై పరిస్థితిని సమీక్షించాలి. చొరబాట్లను నిరోధించడంలోనూ తొలగించడంలోనూ విఫలమైన రెవెన్యూ తదితర సిబ్బందిని తమ వైఫల్యానికి ఈ కమిటీ బాధ్యులను చేయాలి.
5. అటవీ సర్కిల్ స్థాయిలో, జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంట్‌లు సభ్యులుగా, అటవీశాఖ కన్సర్వేటర్ అధ్యక్షునిగా ఒక కమిటీని నియమించాలి. ఈ కమిటీ చొరబాటుదార్లను తొలగించే విషయంలో స్థానిక డివిజనల్ ఫారెస్ట్ అధికారికీ అభయారణ్యాలు, జాతీయ పార్కుల డైరెక్టర్లకూ తోడ్పడడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి.
6. మీ రాష్ట్రంలో చొరబాట్ల సమగ్ర జాబితాను, వాటి తొలగింపు ఎక్కడిదాక వచ్చిందన్న విషయాన్ని ఒక ప్రాథమిక సమాచార పత్రం రూపంలో తయారుచేసి దాని ప్రతి ఒకటి ఈ కేంద్ర మంత్రిత్వ శాఖకు 2002 జూన్ 30 లోపల పంపించండి. జులై

2002తో మొదలుపెట్టి ప్రతీ మూడు నెలలకొకసారి ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఎంత భూమి నుంచి చొరబాటుదార్లను తొలగించింది, ఎంత భూమిలో అడవి మొక్కలు నాటింది తెలియజేసే నివేదికలు సమర్పించవలసి రావచ్చు.

7. అటవీ సంరక్షణ చట్టం (1980) కింద మినహాయింపు ఇవ్వడం కోసం పెట్టుకునే అర్జీల ఆమోదాన్నీ కేంద్ర స్కీముల కింద నిధుల విడుదలనూ చొరబాటుదార్ల తొలగింపుతో ముడిపెట్టవలసి వస్తుందని గమనించండి.

ఈ ఏడు పాయింట్లలో ఎక్కడా ఆదివాసుల ప్రస్తావన లేకపోవడం మరొక్కసారి గుర్తుచేయవలసిన విషయం. అడవులలో తరతరాలుగా హక్కులు అనుభవిస్తున్న ప్రజలెవరూ లేరనీ, నిర్జనంగా ఉన్న అడవులను కొందరు దురాశాపరులు ఆక్రమించుకోవడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమయిందనీ ఈ సర్క్యులర్ చదివిన వారెవరికైనా అనిపిస్తుంది.

రెండవది, 1990 సెప్టెంబర్ 18న ఇదే మంత్రిత్వ శాఖ జారీచేసిన ఆరు సర్క్యులర్లలో మొదటిదాని ప్రస్తావన మాత్రమే ఇందులో ఉంది. మిగిలిన అయిదింటి ప్రస్తావన లేదు. వాటిలోని లోపాలను పైన చూశాం. అయినప్పటికీ అవి మొదటి సర్క్యులర్‌ను దాటి కొన్ని హక్కులు కల్పించాయి.

మూడవది, గతంలో ఎన్నడూ లేనిది ఈ సర్క్యులర్ 'చొరబాటుదార్ల' తొలగింపుకు ఒక గడువు పెట్టింది. విచారణలు చేపట్టే న్యాయస్థానాల అధికారాలను అటవీశాఖ అధికార్లకు కట్టబెట్టాలని సూచించింది.

ఆదివాసుల హక్కుల విషయంలో ఇంత గణనీయమైన మార్పును ప్రవేశపెట్టే ఈ సర్క్యులర్ దుర్మార్గమైనది మాత్రమేకాక చట్ట విరుద్ధమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది కూడ.

> కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు సంబంధించిన అన్ని ప్రధాన విధాన నిర్ణయాలలోనూ జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించాలి.

అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 (9) ఆదేశిస్తుంది. 1990లో జారీచేసిన ఆరు సర్క్యులర్‌లు అప్పటి కమిషనర్ బి.డి.శర్మ గారి సూచనల మేరకు రూపొందించినవి. (ఆ సర్క్యులర్‌లు తన సూచనలను కుదించి వేసిన వైనాన్ని బి.డి.శర్మగారు బహిరంగంగా విమర్శించారన్నది వేరే సంగతి). అందులో అయిదింటిని విస్మరిస్తూ 2002లో జారీచేసిన ఈ సర్క్యులర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించనేలేదు.

ఆ అయిదు సర్క్యులర్‌లను విస్మరించడం సుప్రీంకోర్టు గతంలో జారీచేసిన తీర్పుకు కూడ విరుద్ధం. మహారాష్ట్ర అడవి ప్రాంతాలలో ఆదివాసులను తమ భూముల నుంచి అక్రమంగా తొలగిస్తున్నారన్న అభియోగంతో కష్టకారి సంఘటన అనే సంస్థ ప్రతినిధి ప్రదీప్ ప్రభు 1980లో సుప్రీంకోర్టులో ఒక కేసు వేసారు. దానిపైన 1995లో తీర్పు

చెప్పిన సుప్రీంకోర్టు, ఆదివాసులను తొలగించే విషయంలో 1990 నాటి ఆరు సర్క్యులర్ల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించింది. ప్రపంచీకరణ మంత్రం న్యాయస్థానాలకు ఇంకా పూర్తిగా తలకు ఎక్కని రోజులలో ఇచ్చిన ఈ తీర్పుకు 2002 మే 3వ తేదీ నాటి ఆదేశం విరుద్ధమైనది.

ఇన్నిరకాలుగా దుర్మార్గమైన ఈ సర్క్యులర్ అమలు మాత్రం కొన్ని రాష్ట్రాలలో వెంటనే మొదలయింది. మహారాష్ట్రలోని మేల్‌ఘాట్ ప్రాంతంలో పడమటి కనుమల అడవులలో అటవీ శాఖ అధికారులు ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు కాదు, ఏనుగులను పెట్టి ఆదివాసుల ఇళ్లు బలప్రయోగంతో కూల్చివేసారు.

దాని పర్యవసానాలు చూసే ముందే సుప్రీంకోర్టు నిర్వాకం ఇంకొంచెం చూద్దాం. 2002 ఫిబ్రవరి 18న 'చొరబాటుదార్ల తొలగింపు కోసం మీరేం చేస్తున్నారో చెప్పండి' అని అడిగిన సుప్రీంకోర్టు మే 9వ తేదీన ఒక 'సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ'ని నియమించింది. ఆ కమిటీకి రెండు పనులు అప్పగించింది.

1. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర వ్యక్తులు ఈ కేసులో దాఖలు చేసిన వాంగ్మూలాలను పరిశీలించి వారి సూచనలను సుప్రీంకోర్టు ముందు ఉంచడం.
2. ఈ కేసులో సుప్రీంకోర్టు జారీచేసే ఆదేశాల వల్ల నష్టపోయిన వారి అర్జీలు స్వీకరించి కోర్టు ఆదేశాల పరిధిలో వాటిని పరిష్కరించడం.

విచిత్రమైన ఈ సృష్టిలో కోర్టు కనీసం సమతుల్యం పాటించలేదు. ఇందులోని అయిదుగురు సభ్యులలో ముగ్గురు ప్రభుత్వ అధికారులు, ఇద్దరు ఎన్జీవోలు. ఆ అధికారులు ముగ్గురూ అటవీశాఖ అధికారులే. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గానీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గానీ అందులో లేరు. ఆ యిద్దరు ఎన్జీవోలు అటవీ సంరక్షణ రంగంలో పనిచేసే ఎన్జీవోలే తప్ప ఆదివాసుల సంక్షేమం కోసం పనిచేసే ఎన్జీవోలు కారు. ఆదివాసులు గానీ ఆదివాసీ ఉద్యమ ప్రతినిధులు గానీ అసలే కారు. మొదటినుంచీ అటవీ భూముల 'చొరబాట్ల' సమస్యతో ఆదివాసుల జీవితం, జీవనం ముడిపడి ఉన్నాయని గుర్తించడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు ఈ కమిటీ ఏర్పాటులో సమతుల్యం పాటించకపోవడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదుగానీ మొత్తంగా సుప్రీంకోర్టు వ్యవహార శైలిలో భాగంగా చాలా ఆందోళన కలిగించవలసిన విషయం.

ఈ విధంగా సుప్రీంకోర్టు నెలకొల్పిన కమిటీ జులై 27న విచారణ నిర్వహించింది. పైన పేర్కొన్న తొమ్మిది రాష్ట్రాలకు చెందిన ప్రధాన చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ అంతా హాజరయ్యారు. వారి అడ్వకేట్లూ హాజరయ్యారు. ఏ ఆదివాసీ ప్రతినిధికీ ఆహ్వానం పోలేదు, ఎవరూ హాజరు కాలేదు. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు కూడ అంతే గౌరవం దక్కింది.

కేంద్ర అటవీ శాఖ అధికారులు మెజారిటీగా ఉన్న ఈ కమిటీ, తొమ్మిది రాష్ట్రాల అటవీశాఖ అధికారులను మాత్రం విచారించి మే 3 నాటి కేంద్ర అటవీశాఖ సర్క్యులర్ కంటే క్రూరమైన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది.

## సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ నివేదిక

ఈ నివేదిక పూర్తి పాఠాన్ని అనువదించి ఇచ్చే బదులు, దాని సారాంశాన్ని మా మాటలలో చెప్తాము. ఎక్కడికక్కడ మా వ్యాఖ్యలు కూడ పక్కనే చేరుస్తాము.

దేశం మొత్తం మీద 'చొరబాటుకు' గురయినట్టు కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 12.5 లక్షల హెక్టార్ల కంటె ఎక్కువే చొరబాటుకు గురయిందని కమిటీ అభిప్రాయపడింది. ఎందుకంటే, (i) 1980 కంటె ముందు నుంచి ఉన్న చొరబాట్లలో క్రమబద్ధీకరణకు అర్హంకాని భూములను కూడ రాష్ట్ర ప్రభుత్వాలు లోపాయకారీగా అర్హమైనవిగా భావించి ఆ భూములను లెక్కలోకి తీసుకోకపోవడం వలన; (ii) స్థానిక సిబ్బంది అలవాటుగానే చొరబాట్లను తక్కువ చేసి చూపించడం వలన; (iii) ఎప్పటికప్పుడు కొత్తగా జరిగే చొరబాట్లను లెక్కించక పోవడం వలన.

కమిటీ ముందు ఉన్న సమాచారం నుంచి ఈ నిర్ధారణకు రావడానికి ఆస్కారమేమీ లేదు. ఎన్నికయిన ప్రభుత్వాలకు సహజంగా (చాలా న్యాయంగా) ప్రజల పట్ల ఉండే మొహమాటం పట్ల ఖాకీ బ్యూరోక్రసీకి ఉండే న్యూనతాభావం తప్ప ఈ అభిప్రాయానికి వేరే ఆధారం లేదు.

ఆ తరువాత చొరబాట్ల వల్ల జరిగిన నష్టమెంత అనే లెక్క కట్టింది కమిటీ. ఒక హెక్టారు భూమిలోని దట్టమైన అడవి 'పర్యావరణ విలువ' 50 సంవత్సరాలలో 1,26,74,000 రూపాయలని ప్రకటించి, ప్రభుత్వం చెప్పినట్టు 'చొరబాట్ల'కు గురయిన అడవి భూమి 12.5 లక్షల హెక్టార్లేననుకున్నా చొరబాటు వల్ల జరిగిన నష్టం 4,59,978 కోట్లు అని ప్రకటించింది. మరి ఆ నష్టం నుంచి యాభై ఏళ్లలో ఆ భూమిపైన బతుకుతున్న వారు పొందిన జీవనాన్ని మినహాయించనక్కరలేదా? ఇది నష్టమయితే అది 'లాభం' కాదా? రేపు 75 లక్షల నుంచి కోటి మంది ఆదివాసులను అడవి భూముల నుంచి తొలగించినట్టయితే వారు కోల్పోయే జీవనానికి వెల ఎంత? దానిని కూడ 'పర్యావరణ నష్టం నుంచి మినహాయించనక్కర లేదా? అదే ఎక్కువయితే ఏ నిర్ణయానికి రావాలి? పర్యావరణం నుంచి అందులో బతుకుతున్న మనుషులను మినహాయించి దాని వెల లెక్కగట్టే సంస్కృతిని ఏమనాలి?

ఇక ఆ తరువాత, చొరబాట్లను తొలగించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శించడానికి గల కారణాలను కమిటీ ఏకరవు పెట్టింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు, లాయర్లకు అడవులలో ఆదివాసులుంటారని తెలీదని వాదన కోసం అనుకున్నా, అటవీ శాఖ అధికార్లకు తెలియకుండ పోయే అవకాశం లేదు. అయితే అటవీశాఖ అధికారులు మెజారిటీగా ఉన్న ఈ సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ, 'చొరబాటుదార్లు' అనే వాళ్లు కేవలం బలవంతులయిన కబ్జాదార్లు మాత్రమే అయినట్టు నటిస్తుంది. అయితే ఒక్కచోట అటవీ సిబ్బంది 'ఎస్‌సి, ఎస్‌టి చట్టానికి' భయపడుతున్నారు అంటూ నోరు జారడం వల్ల వారికి అంతా తెలుసునన్న సంగతి బయటపడుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వానికి ఈ కమిటీ చూపించిన కారణాలను ఒక్కొక్కటిగా పరిశీలించడం అనవసరం. ప్రభుత్వాలకు ఈ విషయంలో సరయిన రాజకీయ సంకల్పం లేదనీ, ఇక్కడొకరికీ అక్కడొకరికీ రిజర్వ్ ఫారెస్టులో పట్టాలు ఇవ్వడం వల్ల ఇతరులకు కూడ ఆశలు కలిగి అక్కడే కొనసాగుతున్నారనీ చట్టంలో చొరబాటుదార్లకు కఠినమైన శిక్షలు లేవనీ చొరబాటును ప్రోత్సహించే వారికి (అంటే స్థానిక రాజకీయ నాయకులు లేక ఉద్యమకారులు అని అర్థం కాబోలు) చట్టంలో శిక్షే లేదనీ కమిటీ వాపోయింది. వారి కళ్లకిది ఆక్షేపణీయంగా కనిపించింది. ఘరానా కబ్జాదారుల విషయంలో మనం కూడ ఆక్షేపించవచ్చునుగానీ, 'చొరబాటుదార్ల'లో మెజారిటీ ఆదివాసులని గుర్తుంచుకున్నట్టయితే ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ పుణ్యాన వారికి ఈ మాత్రమైనా వెసులుబాటు చిక్కిందని సంతోషిస్తాం.

మరికొన్ని కారణాలు అభూతకల్పనలు. చిత్తశుద్ధితో చొరబాట్లను తొలగించే ప్రయత్నం చేసే సిబ్బందికి పై అధికారుల నుంచి వేధింపులు వస్తున్నాయంట, 'అవమానాన్నీ బెదిరింపులనూ బదిలీలనూ చవిచూస్తున్నా'రంట. వాళ్ల మీద ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసులు పెడతామన్న బెదిరింపు కూడ వారికి అవరోధంగా ఉందంట, చొరబాట్ల తొలగింపుకు కావలసిన అధికారాలు వారికి కొరవడ్డాయంట, వారికి సరయిన వాహనాలు లేవంట, ప్రతిఘటనను ఎదుర్కొనడానికి కావలసిన పోలీసు సహాయం దక్కడం లేదంట.

అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు కలసికట్టుగా ఆదివాసీ గ్రామాలపైన దాడిచేసి జనాన్ని చావగొట్టి ఇళ్లు తగలబెట్టి పంటలు ధ్వంసం చేసి కోళ్లూ గొర్రెలూ ఎత్తుకుపోయిన ఘటనలు కోకొల్లలు. వాళ్లను ఆపేది ఏదయినా ఉంటే అది వారి అవినీతి ఒక్కటే. కల్లు, కోడికూర నైవేద్యం పెడితే చల్లబడతారు. ప్రస్తుత పరిస్థితులలో అదే ప్రజల పాలిట వరం అయింది. (ఇదికాక మరొక్కటి నక్సలైట్ల భయం. హింసను సమర్థిస్తున్నామని మాపైన దాడి చేయబోతారుగానీ ఆదివాసులను ప్రస్తుతానికి – కనీసం కొన్ని అడవులలో – కాపాడుతున్నది ఈ భయమే) ఇక అటవీ సిబ్బందిపైన ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు పెట్టడం మాటకొస్తే, వాటి సంఖ్యను లెక్కపెట్టడానికి ఒక చేతి వేళ్లు చాలును.

ప్రభుత్వాల వైఫల్యాలను ఈ విధంగా వ్యాఖ్యానించిన సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఆపైన మే 3 నాటి కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను ఆమోదించి, దానికి 'బలం' చేకూర్చడానికి మరికొన్ని విషయాలు చేర్చింది.

1. ఈ ఆదేశం అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా బాధ్యత వహిస్తారు.
2. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, పోలీసు డైరెక్టర్ జనరల్ కలిసి ఆయా రాష్ట్రాలలో ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించే కమిటీగా ఏర్పడతారు. నెలకొకసారి ఈ పర్యవేక్షక కమిటీ తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన

కార్యదర్శి చొరబాట్ల తొలగింపు ఎక్కడిదాకా వచ్చిందో, పూర్తికావడానికి ఇంకెంత కాలం పడుతుందో తెలియజేసే వాంగ్మూలం సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ ముందు దాఖలు చేయాలి.

3. చొరబాట్ల తొలగింపుకు ముందు కేవలం ఏడు రోజుల నోటీసు స్థానిక పత్రికలలో ప్రచురిస్తే చాలును.

4. చొరబాట్లను తొలగించడంలో విఫలమయిన రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి నష్టపరిహారం కట్టవలసి ఉంటుంది. హెక్టారుకు నెలకు 1000 రూ॥ల చొప్పున బ్యాంకులో వేయాలి. వారు చొరబాట్ల తొలగింపు విషయంలో చూపుతున్న ప్రగతిని బట్టి అందులో ఎంత భాగాన్ని నష్టపరిహారంగా కేంద్రానికి అప్పగించేదీ సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ నిర్ణయిస్తుంది.

5. సిబ్బంది ఎవరైనా చొరబాట్ల తొలగింపు విషయంలో ఉత్సాహం చూపించడంలేదని సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీకి అనిపించినట్టయితే వారి జీతం నుంచి ఈ కమిటీ నెలకు 100 రూ॥ల జుర్మానా వసూలు చేస్తుంది. వారి ప్రవర్తన 'మెరుగుపడేంత' వరకు వసూలుచేస్తూ ఉంటుంది.

6. చొరబాట్ల తొలగింపు విషయంలో అటవీ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ప్రదర్శించిన వైఖరి వారి సర్వీస్ రికార్డులోకి ఎక్కించబడుతుంది. (అంటే ఉత్సాహం చూపించకపోతే ప్రమోషన్లు దక్కవని అర్థం)

7. ఈ ఆదేశాన్ని అమలు చేసే క్రమంలో ఎవరికయినా అన్యాయం జరిగినట్టయితే – అది అనవసర బలప్రయోగం వల్ల గానీయండి, అకారణమైన కాల్పుల వల్ల గానీయండి, ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం కింద శిక్షార్హమైన చర్య వల్ల గానీయండి – ఆ బాధితులు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీకి చెప్పుకోవాలి. కమిటీ ఆ ఫిర్యాదు మీద రిపోర్టు సుప్రీంకోర్టుకు సమర్పిస్తుంది. సుప్రీంకోర్టు దానిపైన తగు ఆదేశాలు జారీచేస్తుంది. (అంటే బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లోగానీ కోర్టులో గానీ కేసు వేయడానికి వీలులేదు. నేరుగా సుప్రీంకోర్టుకు రావాలి).

మరి తొలగింపుకు గురయిన ఆదివాసుల సంగతి?

8. రాష్ట్ర ప్రభుత్వాలకు వారికి పునరావాసం కల్పించే స్వేచ్ఛ ఉంటుంది. (అంటే కల్పించకుండ ఉండే స్వేచ్ఛ కూడ ఉంటుందని అర్థం).

సుప్రీంకోర్టు అనాలోచితంగా తన మధ్యంతర ఉత్తర్వు ద్వారా అటవీశాఖ అధికారులకు 'సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ' అని పేరుపెట్టి కోర్టుకు సహాయపడమని, ప్రజల ఫిర్యాదులు స్వీకరించమని అడిగేసరికి వారు తమకు తాము ఎంత అధికారం కట్టబెట్టుకున్నారో చూడండి! వారి ఈ నివేదికను సుప్రీంకోర్టు ఆమోదించినట్టయితే వారికి కార్యనిర్వాహక అధికారాల నుంచి న్యాయాధిపతుల అధికారాల దాకా అన్నీ సంక్రమిస్తాయి.

ఈ నివేదికను సెప్టెంబర్ 9న సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోర్టుకు సమర్పించనుందనీ, జస్టిస్ కిర్పాల్ దానిని ఆమోదించి ఆదేశం జారీచేయబోతారనీ ఆగస్టు నెల ఆఖరి వారంలో దేశమంతటా వదంతులు వ్యాపించడం ప్రజాతంత్ర వర్గాలలో చాలా కలవరం రేపింది. అసలు ఈ సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ అనే దానిని నెలకొల్పడంలో సుప్రీంకోర్టు తన అధికారాల పరిధిలో వ్యవహరించిందా అనేది చాలా సందేహాస్పదం.

నిజమే, వేరే ఏ న్యాయస్థానానికీ లేని విశేష అధికారాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు ఇచ్చింది. (మిగిలిన కోర్టులు చట్టం పరిధిలో ఆ వ్యాజ్యాన్ని పరిష్కరించి ఊరుకోవాలి) ఆ విషయంలో పార్లమెంటు అప్పటికే ఒక చట్టం చేసి ఉంటే సుప్రీంకోర్టు అందుకు విరుద్ధంగా ఆదేశాలు జారీచేయదు గానీ, ఏ చట్టమూ లేనప్పుడు పార్లమెంటు ఒక చట్టం చేసేంత వరకు తగు ఆదేశాలు జారీచేస్తుంది.

ఇప్పటిదాకా ఈ అధికారాన్ని సుప్రీంకోర్టు ప్రజానుకూలంగానే ఉపయోగించింది. పోలీసులు అరెస్టు చేసేటప్పుడు పాటించవలసిన నియమాలను (దానికి సంబంధించిన వివరమయిన చట్టమేదీ లేదు కాబట్టి) 'డి.కె.బసు' కేసులో సుప్రీంకోర్టు ఆదేశించింది. అదేవిధంగా, పని స్థలంలో స్త్రీలు అనుభవించే లైంగిక వేధింపుల నివారణ కోసం 'విశాఖ' కేసులో ఆదేశాలు జారీచేసింది. టెలిఫోన్ టాపింగ్ విషయంలో పాటించవలసిన నియమాలను 'పియుసిఎల్' కేసులో జారీచేసింది. టాడా కేసులో ముద్దాయి వాంగ్మూలం నమోదుచేసే పోలీస్ అధికారి అనుసరించవలసిన నియమాలను 'కర్తార్‌సింగ్' కేసులో జారీ చేసింది.

ఇవన్నీ హక్కులు చట్టంలో స్పష్టంగా లేనిచోట వాటిని కల్పించడం కోసం ఆర్టికల్ 142ను వాడుకున్న ఉదంతాలు. ఇకమీదట ప్రజా వ్యతిరేకమైన చట్టాలు చేయడానికి పార్లమెంటు వెనకాడితే ఆ ఖాళీని పూరించడానికి సుప్రీంకోర్టు ఆర్టికల్ 142ను అడ్డంపెట్టుకొని రంగంలోకి దిగే ప్రమాదం ఉంది. 'ఆర్థిక సంస్కరణల' విషయంలో ప్రభుత్వాలు వేగంగా ముందుకు పోవడం లేదనీ 'వోట్ బ్యాంక్' రాజకీయాల కారణంగా 'ప్రజాకర్షక' బలహీనతలకు లోనవుతున్నాయనీ మనదేశంలోని శిష్టవర్గాలు విసుగు చెందుతున్నారు. జడ్జిలు అందులో అగ్రభాగాన ఉన్నారు. ప్రభుత్వాలలాగా వీరికి వోట్లు అక్కరలేదు కాబట్టి 'ప్రజాకర్షక' బలహీనతలు వీరిని అంటవు.

గోదావర్మన్ కేసులో సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీని నెలకొల్పిన జస్టిస్ కిర్పాల్‌గారి ఆర్డరు దీనికి సూచిక కావచ్చు.

## కథకు తాత్కాలికంగా తెర

దేశంలోని రిజర్వ్ అడవులలో భూములు అనుభవిస్తున్న ఆదివాసీ కుటుంబాలు 15 లక్షల దాకా ఉన్నాయనీ, వారి జనాభా కోటి దాకా ఉండవచ్చుననీ మొదట్లో అన్నాము. వీరెవ్వరికీ ఏమీ తెలియకుండానే 2001 నవంబర్‌లో సుప్రీంకోర్టులో మొదలయిన గోదవర్మన్ కేసు విచారణ 2002 జూన్‌దాకా సాగింది. మే నెల 3వ తేదీన కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ

జారీచేసిన సర్క్యులర్‌ను స్థానిక అటవీ సిబ్బంది ఇక్కడా అక్కడా అమలు చేయడం మొదలుపెట్టాకే ఆదివాసులకూ వారి శ్రేయోభిలాషులకూ ఆ విషయం తెలిసింది.

మహారాష్ట్రలోని పడమటి కనుమలలోని మేల్‌ఘాట్ ప్రాంతంలో అటవీ సిబ్బంది ఏకంగా ఏనుగులను తీసుకొచ్చి ఆదివాసీ ఆవాసాలను ధ్వంసం చేయడం మొదలుపెట్టింది. రాణిగామ్, గోలాయ్, మోటాఖేడా, సోంతాణా, బారాటండా, పలస్‌కుండి, దాద్రా, హీరంబాయి గ్రామాలలో ఈ విధ్వంసం జరిగింది. అప్పటికి వర్షాకాలం మొదలయింది. ఇళ్లు కూలిపోయిన ఆదివాసులు కుండపోతగా కురుస్తున్న వర్షంలో, చలిలో వణుకుతూ చెట్ల కింద ఆశ్రయం తీసుకున్నారు.

1986లో సుప్రీంకోర్టులో కేసువేసి 1990 నాటి సర్క్యులర్లను అమలు చేయవలసిందిగా 1995లో తీర్పు పొందిన కష్టకారి సంఘటన ప్రతినిధి ప్రదీప్ ప్రభుకు ఈ విషయం తెలిసి మేల్‌ఘాట్ వెళ్లాడు. అటవీశాఖ సిబ్బందిని ప్రశ్నించి సుప్రీంకోర్టులో నడుస్తున్న తంతు గురించి, కేంద్ర అటవీశాఖ మే 3న జారీచేసిన సర్క్యులర్ గురించి తెలుసుకున్నాడు. తను సేకరించిన సమాచారాన్ని ఇంటర్నెట్ ద్వారా దేశవ్యాప్తంగా అతను ప్రచారం చేయడంవల్లే విషయం అందరికీ తెలిసింది.

ఆ తరువాత కష్టకారి సంఘటన, శ్రుతి, సమత అనే ఆదివాసులలో పని చేసే ఎన్జీవోలు గోదవర్మన్ కేసులో ఇంప్లీడ్ అయ్యే ప్రయత్నం చేసాయి. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డా॥ బిజయ్ శంకర్ శాస్త్రి సెప్టెంబర్ 6వ తేదీన ప్రధానమంత్రికొక బహిరంగ లేఖ రాసారు. మే 3వ తేదీన సర్క్యులర్ జారీచేసే ముందు కేంద్ర అటవీశాఖ గానీ, సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించే ముందు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీగానీ తనను సంప్రదించక పోవడం పట్ల అభ్యంతరం తెలిపారు (సుప్రీంకోర్టు ప్రవర్తన గురించి కూడ అదే భూమిక మీద అభ్యంతరం తెలిపి ఉండవచ్చునుగానీ మొహమాట పడ్డట్టున్నారు). మాజీ ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ బి.డి.శర్మగారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వివరమైన లేఖ రాసి ఆయనగారి వృక్ష సంరక్షణోద్యమం పర్యవసానం ఏ విధంగా ఉండగలదో హెచ్చరించారు. వారి తరువాత జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ పదవి నిర్వహించిన దిలీప్ సింగ్ భూరియా గారు మేల్‌ఘాట్‌కు స్వయంగా వెళ్లివచ్చి వివరమయిన ప్రకటన చేసారు.

గోదవర్మన్ కేసులో ఇంప్లీడ్ అయ్యే ప్రయత్నం చేసిన సంస్థలు సుప్రీంకోర్టులోని కొందరు ప్రజానుకూలురయిన న్యాయవాదుల ద్వారా అమెకస్‌క్యూరీ, సీనియర్ న్యాయవాది అయిన హరీష్ సాల్వే గారికి అడవులలో ఆదివాసులు ఉంటారనీ వారికి భూమిలేకపోతే తిండి దొరకదనీ తిండి దొరకకపోతే చస్తారనీ ఇత్యాది ప్రాథమిక జీవిత సత్యాలు బోధించారు. 'ఇది సత్ఫలితం ఇచ్చింది' అని వారు అంటున్నారు. సాల్వేగారు కేసులో తొందరపడి తీర్పు కోరకుండ ఉండడానికి - లాయర్ల భాషలో చెప్పాలంటే వాయిదా తీసుకోవడానికి - ఒప్పుకున్నారు.

ఈ విధంగా సెప్టెంబర్ 9 వచ్చింది, పోయింది. అందరూ భయపడినట్టు సుప్రీంకోర్టు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ రిపోర్టుకు ఆమోదముద్ర వేసి దేశం మీద వదలలేదు. నవంబర్ నెలలో కిర్పాల్‌గారు రిటైరయ్యారు. ఆ తరువాత వచ్చిన ప్రధాన న్యాయమూర్తికి చెట్ల సంరక్షణ విషయంలో అంత పట్టుదల లేదు కాబట్టి ప్రస్తుతానికి గండం గడచినట్టే. అట్లాగే సెప్టెంబర్ 30 గడువు లోపల అడవులన్నీ ఖాళీ చేయించడం ఆచరణ సాధ్యంకాదని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడం వల్ల మే 3 నాటి సర్క్యులర్ అమలు కూడ ప్రస్తుతానికి ఆగి ఉంది.

కానీ ఆ సర్క్యులర్‌ను కేంద్ర ప్రభుత్వమింకా వెనక్కి తీసుకోలేదు. ఇంకొక తారీఖు పెట్టి తిరిగి జారీచేయవచ్చు. అలాగే సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీని నెలకొల్పిన ఆర్డర్‌ను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోలేదు. వారి నివేదికను సుప్రీంకోర్టు ఇంకా పరిశీలించాల్సి ఉంది.

అన్నిటినీ మించి, ఆదివాసుల జీవించే హక్కు విషయంలో ప్రభుత్వము, కోర్టులు ప్రదర్శిస్తున్న అసహనానికి మూలమైన 'సంస్కరణల' వాతావరణం చావలేదు సరికదా, దినదిన ప్రవర్ధమానం అవుతున్నది.

కాబట్టి గొడ్డలి వేటు తాత్కాలికంగా తప్పించుకున్న ఆదివాసులు అప్రమత్త స్థితిని విడనాడకుండ ఒక పాజిటివ్ అజెండాతో ముందుకు పోవలసి ఉంది. 1990 నాటి ఆరు సర్క్యులర్లను 29వ ఎస్‌సి ఎస్‌టి కమిషనర్ రిపోర్టుకు అనుగుణంగా సవరించి తక్షణం అమలు చేయాలన్న డిమాండ్ ఆచరణ సాధ్యమైన అజెండా కాగలదని పైన వివరించాము. దానితోనే ఆదివాసీ ఉద్యమాలు సంతృప్తి చెందనవసరం లేదు. ఉద్యమాల బలాన్ని బట్టి, పరిస్థితుల అనుకూలతను బట్టి ఇంకా ముందుకుపోవచ్చు. కానీ ఈ అజెండా ఇప్పటికే ఒకమేరకు సాధికారత పొందింది కాబట్టి అన్ని ఆదివాసీ జాతులనూ సంఘాలనూ కూడగట్టి ముందుకు నడిపించడానికి ఇది సరయిన అజెండా కాగలదు. మొదటి మెట్టు కాగలదు.

ఆనాటి నుండీ ఈనాటిదాకా చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్న ఒక విషయమేమిటంటే పర్యావరణ సమతుల్యానికి కావలసింది అడవులు కాదు, చెట్లు. అంటే అటవీ శాఖ యాజమాన్యంలోని భూమిని కబ్జాదార్ల నుంచి, పోడు వ్యవసాయం చేసే ఆదివాసుల నుంచి కాపాడి వనాలు పెంచడమే దానికి ఏకైక పరిష్కార మార్గం కాదు. రెవెన్యూ భూమిలో (అది పట్టాభూమి కావచ్చు, ప్రభుత్వ పోరంబోకులో బంజర్లో కావచ్చు) పంటచేల బదులు చెట్లు పెంచడాన్ని ప్రోత్సహించడమూ అదే ఫలితాన్ని ఇస్తుంది. ఉదాహరణకు, 10 వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్టు నుంచి 5 వేల ఆదివాసీ కుటుంబాలను తొలగించి, వారు వ్యవసాయం చేసుకుంటున్న సాగు భూములలో టేకు చెట్లో, మద్ది చెట్లో పెంచే బదులు వారిని అక్కడే వ్యవసాయం చేసుకోనిచ్చి, ఆ అడవి బయట 10 వేల ఎకరాల పట్టా భూములలో మామిడి తోటలో, సీతాఫలం తోటలో పెంచడానికి కావలసిన ప్రోత్సాహాన్ని రైతులకు ఇయ్యవచ్చు. ప్రోత్సాహం చాలకపోతే ఋణాల మంజూరీతో ముడిపెట్టి బలవంతమూ చేయవచ్చు. ఒక్కొక్కచోట దీని వల్ల రైతులు కొంత ఆదాయం కోల్పోవలసి రావచ్చు. కానీ పర్యావరణం కోసం ఆదివాసులు మాత్రమే ఎందుకు త్యాగాలు చేయాలి? మనమంతా ఎందుకు చేయకూడదు?

